

కలవచర్ల కేవీకేలో పీఎం కిసాన్ నిధుల విడుదలను వీక్షిస్తున్న రైతులు

రైతుల ఖాతాల్లో 19.72 కోట్లు జమ

రాజానగరం, జూన్ 18 : పీఎం కిసాన్ పథకం 17వ విడతలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో 18 మండలాలకు చెందిన 98,612 మంది రైతులకు రూ.19.72 కోట్ల 24 వేలు జమ చేసినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. రాజానగరం మండలం కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రంలోని ప్యాక్స్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు రైతులతో కలిసి వీక్షించారు. కలెక్టర్ వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణసిలో మంగళవారం కిసాన్ సమ్మేళన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా రైతులకు పీఎం కిసాన్ పథకం 17వ విడత నిధులు జమ చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 107 ప్యాక్స్‌లలో ప్రత్యేక కార్యక్రమాలను మండలాల వారీగా ఏర్పాటు చేసినట్టు మాధవరావు తెలిపారు. అనపర్తి మండలంలో 4,183 మంది రైతులకు రూ.83,66 లక్షలు, బిక్కవోలు మండలంలో 5,572 మంది రైతులకు రూ.1.11 కోట్లు, రంగంపేట 6,370 మందికి రూ.1.27 కోట్లు, రాజమహేంద్రవరం రూరల్ 1,896 మందికి రూ.37.92 లక్షలు, కడియం 5,234 మందికి రూ.1.04 కోట్లు, రాజానగరం 8,472 మందికి రూ.1.69 కోట్లు, కోరుకొండ 6,300 మందికి రూ.1.26 కోట్లు, సీతానగరం 5,049 మందికి రూ.1.98 కోట్లు, గోకవరం 7,011 మందికి రూ.1.40 కోట్లు, దేవరపల్లి 6,250 మందికి రూ.1.25 కోట్లు, గోపాలపురం 5,273 మందికి రూ.1.05 కోట్లు, నల్లజర్ల 6,761 మందికి రూ.1.35 కోట్లు, కొవ్వూరు 5,297 మందికి రూ.1.06 కోట్లు, చాగల్లు 5,163 మందికి రూ.1.03 కోట్లు, తాళ్లపూడి 4,116 మందికి 82.32 లక్షలు, ఉండ్రాజవరం 5,077 మందికి రూ.1.1 కోట్లు, నిడదవోలు 5,241 మందికి రూ.1.05 కోట్లు, పెరవలి 5,347 మందికి రూ.1.7 కోట్ల నగదును సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ నాయుడు, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో శాంత,మోది సత్తిబాబు, రైతులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లపై దృష్టి పెట్టండి : కలెక్టర్



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 18: జిల్లాలో అన్న క్యాంటీన్లు పునఃవ్యవస్థీకరణకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని మునిసిపల్ కమిషనర్లకు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేర కు రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం అధికారులతో సమీక్షించారు. రాజమహేంద్రవరంలో 3, నిడదవోలు, కొవ్వూరులలో ఒక్కొక్కటి చొప్పున అన్న క్యాంటీన్లు గతంలో నిర్వహించినట్టు తెలిపారు. ఆయా కాంటీన్లు ప్రారంభించడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కాన్ఫరెన్స్‌లో కమిషనర్లు దినేష్ కుమార్, డానియేల్ జోసఫ్,టి.రామ్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాటా..కోటా!

రేషన్ కాటాలోనూ బొక్కుడే..



- పేదల రేషన్‌లోనూ కక్కుర్తి
- తూకంలో పెద్ద ఎత్తున తేడా
- మంత్రి ఆదేశాలతో తనిఖీలు
- జిల్లాలో కేజీకి 100 గ్రాములు..
- అరకేజీకి 50 గ్రాములు నొక్కుడు
- ప్రభుత్వానికి అధికారుల నివేదిక
- ఐదేళ్లలో ఏడుగురు డీఎంల మార్పు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అన్ని వ్యవస్థలు గాలిలో ఉన్నాయి.. వైసీపీ విధ్వంసానికి బలైపోయాయి.. మళ్లీ గాడిలో పెడదామని రంగంలోకి దిగిన మంత్రులు తలలు పట్టుకుంటున్నారు.. వైసీపీ ప్రభుత్వం సివిల్ సప్లయిస్ వ్యవస్థను వదల్లేదు. అక్కడా విధ్వంసం సృష్టించింది. పేద ప్రజలకు రేషన్ కార్డుల ద్వారా ఇచ్చే కోటా సరుకుల్లోనూ కోత విధించి అక్రమాలకు తెరలేపింది. ఇటీవల కూటమి సివిల్ సప్లయిస్ మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్‌లో పంపిణీ చేసే కందిపప్పులో అవకతవకలను గుర్తించి అవాక్కయ్యారు. గతేడాది అక్టోబరు నుంచే కందిపప్పు ఇవ్వడం మానేశారు.పంచదార కొంతమందికే ఇస్తున్నారు. ఆయిల్ రేషన్‌లో నిల్.. ఇదిలా ఉండగా జిల్లాలో సివిల్ సప్లయిస్ డీఎంను ఏడు సార్లు మార్చారు. 8వ డీఎం ప్రస్తుతం పనిచేస్తున్నారు.ధాన్యం కొనుగోలు, కస్టమ్ రైస్ మిల్లింగ్ వాటిలో జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఒత్తిడి పెరిగింది. వైసీపీ నేతల ఒత్తిడితో వారికి కావలసిన మిల్లర్లకే ధాన్యం కొనుగోలు అవకాశాలు కల్పించారు. కాదు కూడదంటే అధికారులను మార్చేస్తున్నారు. ఈ విధంగా జిల్లాలో ఇప్పటి వరకూ ఏడుగురు మారారు.

జిల్లాలో 5.73 లక్షల కార్డులు..

సివిల్స్ సప్లయిస్ సంస్థ ఆధ్వర్యంలో బియ్యం కస్టమ్ మిల్లింగ్, రేషన్ దుకాణాలకు బియ్యం, కందిపప్పు,పంచదార సరఫరా వంటివి ఉంటాయి. జిల్లాలోని అంగన్‌వాడీలకు ఇక్కడ నుంచి బియ్యం, కందిపప్పు, ఆయిల్ వంటివి సరఫరా చేస్తారు. డీఎం నుంచి డీఎస్‌వోకు సరుకు వెళ్లిన తర్వాత రేషన్ దుకాణాలు, సంబంధిత సంస్థలకు సరఫరా చేస్తారు. జిల్లాలో 5 లక్షల 73 వేల రేషన్ కార్డులు ఉన్నాయి. 870 రేషన్ షాపులు, 364 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. నెలకు జిల్లాలో 8,500 టన్నుల బియ్యం, 235 టన్నుల పంచదార, అదే స్థాయిలో కందిపప్పు పంపిణీ చేయాలి. కానీ గత అక్టోబరు నెల నుంచి కందిపప్పు రావడంలేదు. కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నట్టు చెబుతూ బయట మార్కెట్ రేటు ఎక్కువగా ఉండడం వల్ల సొమ్ములు చేసుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. అంగన్‌వాడీల పరిస్థితీ అంతే. పైగా పంచదార,కందిపప్పు సరఫరా చేసే కాంట్రాక్టర్లు తూకాల్లో మోసం చేస్తున్నారు. లెక్క ప్రకారం కార్డులోని ఒక్కో మనిషికి 5 కేజీల బియ్యం పంపిణీ చేస్తారు. కార్డుదారులకు రూ.67లకే కేజీ కందిపప్పు, రూ.17లకే అరకేజీ పంచదార ఇవ్వాలి. ఇక ఏఏవై కార్డుదారులకు పంచదార కేజీ రూ.13లకే ఇవ్వాలి. కానీ అనేక అవకతవకలు జరిగాయి. కేంద్రం నుంచి వచ్చిన ఉచితం బియ్యం పంపిణీ కూడా సక్రమంగా జరగలేదంటే పరిస్థితి ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

గడపగడపకూ లేదు..

డీఎస్‌వో ద్వారా రేషన్ షాపులకు గతంలో బియ్యం, పంచదార, కందికప్పు,పామాయిల్ వంటివాటితో పాటు సంక్రాంతి, క్రిస్మస్ వంటి కానుకలు కూడా పంపిణీ చేశారు. వైసీపీ హయాంలో ఈ వ్యవస్థ ధ్వంసమైంది. ఏ నెలలో ఏ సరుకు ఇస్తారో కూడా తెలియదు. రేషన్ షాపులను పక్కన పెట్టి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తామని చెప్పినా అది పూర్తిగా సక్సెస్ కాలేదు. ఎండీయూ వాహనదారులకు సరుకు పెట్టుకునే అవకాశాలు లేకపోవడంతో రేషన్‌షాపు డీలర్ల వద్దే ఉంచి అక్కడ నుంచి వాహనంలో తీసుకు వెళుతున్నారు. రేషన్ వాహనం ఇంటింటికీ పంపిణీ చేయాలనేది ఆలోచన అయితే వీధివీధికీ అన్నట్టు తయారైంది.

జిల్లాలో బయటపడ్డ మోసాలు

రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ లో లోపాలను పట్టుకోవడంతో పాటు వాటిని సరిదిద్దడా నికి ఉపక్రమించింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేసి నప్పుడు తూకంలో మోసం బయటపడిన సంగతి తెలి సిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్ని జిల్లాలకు ఆదేశాలు పంపింపిది. అన్ని మండల లెవల్ స్టాయి పాయింట్లలో తనిఖీ చేసి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. తూనికలు కొలతలు, సివిల్ సప్లయిస్ డీటీ, ఓ జిల్లా స్థాయి అధికారితో ఒక కమిటీ చొప్పున మూడు కమిటీలు వేసి తనిఖీలు చేయించారు. అన్ని ఎంఎల్ఎస్ పాయింట్లలోనూ తనిఖీలు చేయగా, ప్రతి సరుకులోనూ తూకం తక్కువ ఉండడం గమనించారు. కేజీకి 100 గ్రాములు, అరకేజీకి 50 గ్రాములు తక్కువ ఉంది.ఈ నివేదికను ప్రభుత్వానికి పంపడంతో తక్కువ తూకం ఉన్న సరుకును పంపిణీ చేయకుండా నిలిపివేయవలసిందిగా ఆదేశించారు. ప్రభుత్వం వీటిని సరిచేసి పంపడమో.. కొత్తగా పంపడమో చేస్తుంది.

ఇక కందిపప్పు ,పంచదార

వచ్చే నెల నుంచి అన్ని రేషన్ కార్డులకు బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార పంపిణీ చేసే ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తుంది. ఇంకా వీటిపై స్పష్టమైన ఆదేశాలు రాలేదు. ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తారా? లేదా రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తారా! మరింత మెరుగైన విధానం అమలు చేస్తారా అనేది తేలాలి.



సచివాలయానికి వెళ్లిన ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు .. చిత్రంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఉన్నారు. - నిడదవోలు

సీనియర్ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

50 శాతం దాటని ఉత్తీర్ణత

జిల్లాలో పాస్ 49.40 శాతమే

రాజమహేంద్రవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ(ఐపీఎస్ఈ మే 2024)లో రెండో ఏడాది పరీక్షా ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. వీటిలో జిల్లాలో 49.40 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు 755 మంది పరీక్షలు రాయగా 382 మంది, ఎయిడెడ్ 56 మంది పరీక్షలు రాయగా 24 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ 76 మంది పరీక్షలు రాయగా 44 మంది, కోఆపరేటివ్ 73 మంది పరీక్షలు రాయగా 27 మంది, హైస్కూల్ ప్లస్ 121 మంది పరీక్షలు రాయగా 69 మంది, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ 2136 మంది పరీక్షలు రాయగా 1057 మంది, ప్రైవేట్ కాంపోజిట్ 144 మంది పరీక్షలు రాయగా 59 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం జిల్లాలో 3,361 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1,662 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో 422 మంది విద్యార్థులకు 216 (51శాతం) మంది పాసయ్యారు. ఫలితాలు https://resultsbie.ap.gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి ఆయా కళాశాలల్లో విద్యార్థులు ఒరిజినల్ మార్కుల మెమోలను పొందవచ్చని అధికారులు తెలిపారు. రీవెరిఫికేషన్‌కి ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకూ సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి ఏడాది సప్లిమెంటరీ ఫలితాలను ఈ నెల 26న విడుదల చేస్తామన్నారు.

వెనుకే వచ్చాడు.. డబ్బు లాక్కుపోయాడు

సంచిలో రూ.లక్ష ఉందని ఫిర్యాదు

కొవ్వూరు, జూన్ 18 : నడిచి వెళుతున్న వ్యక్తి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రూ.లక్ష నగదు సంచి లాక్కొని పారిపోయినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. కొవ్వూరు మెయిన్‌రోడ్‌లో శ్రీ లక్ష్మీ శ్రీనివాసా రైస్ అండ్ కిరాణా వ్యాపారం చేస్తున్న జక్కా శ్రీనివాస్ ఈ నెల 17వ తేదీన రాత్రి 9:30 గంటల సమయంలో షాపు కట్టిన తరువాత ఇంటికి నడిచివెళుతున్నాడు. పుంతలో మునలమ్మ గుడి వీధిలో వెనుక వైపు నుంచి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి తన ఎడమ చేతిలో ఉన్న రూ. లక్ష డబ్బు సంచి లాక్కొని పారిపోయినట్టు బాధితుడు తెలిపారు. తాను వెనుక వెంబడిస్తూ పరిగెత్తి కింద పడిపోగా కుడి భుజం గూడుకు దెబ్బ తగిలిందన్నారు. పెద్దగా కేకలు వేయడంతో చుట్టుప్రక్కల వాళ్లు వచ్చి కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా రాజమహేంద్రవరం రిఫర్ చేశారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసును మోదు చేసినట్టు హెచ్‌సి బాబూరావు తెలిపారు.

వర్రీంయే!



- అందని వరి విత్తనాలు
- లబోదిబోమంటున్న రైతులు
- 10 శాతం విత్తనాల సరఫరా లేదు
- అన్నదాతల ఎదురుచూపులు
- కోరుకొండ డివిజన్‌లో ఇదీ పరిస్థితి

కోరుకొండ, జూన్ 18 : ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులు అవుతుంది.. అయినా ఇంత వరకు కోరుకొండ సబ్‌డివిజన్‌వ్యవసాయశాఖ పరిధిలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు సంబంధించి రైతుల అవసరాలకు కనీసం 10 శాతం వరి విత్తనాలను వ్యవసాయశాఖ సిద్ధం చేయలేదు. కోరుకొండ మండలంలో 5912 హెక్టార్లు, గోకవరం మండలంలో 5124 హెక్టార్లు, సీతానగరం మండలం 5665 హెక్టార్లలోను వరిసాగు చేస్తున్నారు.మొత్తంగా 16,701 హెక్టార్లు అనగా సుమారు 42 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ఈ మేరకు రైతులకు 835 టన్నుల వరి విత్తనాలు అవసరం. దీనిలో మండల వ్యవసాయ శాఖ కనీసం 10 శాతం విత్తనాలు కూడా సిద్ధం చేయలేదు. రైతు భరోసా కేంద్రాల్లో కూడా రైతులకు అవసరమైన వరి విత్తనాలు లేవు.ఖరీఫ్ సీజన్ నెల రోజులకు ముందే రైతులకు అవసరమైన విత్తనాలను సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే నేటికీ విత్తనాలు అందక పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు అవసరమైన నాణ్యమైన వరి విత్తనాలను అందజేసేవారు. ఈ సంవత్సరం ఎందుకో మరి కోరుకొండ, శ్రీరంగపట్నం, బూరుగుపూడి, గాడాల, దోసకాయలపల్లి సొసైటీల్లో వరి విత్తనాలకు ఆర్డర్లు పెట్టలేదు. అటు వ్యవసాయ శాఖ ద్వారా కానీ, ఇటు రైతు సొసైటీల ద్వారా కానీ రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ టీచర్లు అధిక ధరలకు వరి విత్తనాలు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖ సబ్ డివిజన్‌లో మొత్తం 64 రైతు భరోసా కేంద్రాలకు వరి విత్తనాలు సిద్ధం చేయలేదు.తక్షణం తమకు అవసరమైన నాణ్యమైన వరి విత్తనాలు వ్యవసాయ శాఖ ద్వారా కానీ, రైతు పరపతి సంఘాల ద్వారా కానీ అందజేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లికార్జునరావును వివరణ కోరగా 110 టన్నుల వరి విత్తనాలకు ఇండెంట్ పెట్టినా ఇంకా రాలేదు.. వస్తాయో రావో తెలియదన్నారు.



కొవ్వూరులో టిడ్కో గృహాల వద్ద అధికారులతో మాట్లాడుతున్న ముప్పిడి

4 నెలల్లో టిడ్కో ఇళ్లు

- గత టీడీపీ హయాంలోనే 80 శాతం పనులు
- ఐదేళ్లలో జగన్ 20 శాతం పూర్తిచేయలేదు
- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ధ్వజం

కొవ్వూరు, జూన్ 18 : పట్టణ ప్రాంతాల్లో పేదలందరికి కూటమి ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు అందిస్తామని కొవ్వూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే విజేత ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని టిడ్కో గృహాలను కూటమి నాయకులతో కలిసి మంగళవారం సందర్శించారు. 2014-19లో పట్టణ ప్రాంతాల్లో ఉన్న పేదలందరికి సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టారన్నారు.కొవ్వూరులో 240 సింగిల్ బెడ్ రూమ్‌లు, 240 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేసి వారి నుంచి షేరు ధనం కట్టించి గృహాల నిర్మాణం చేపట్టి 80 శాతం నిర్మాణ పనులు పూర్తిచేశారన్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కేవలం 20 శాతం పనులు పూర్తి చేసి ఇవ్వలేకపోయిందన్నారు. టిడ్కో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతుంటే జగన్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందాడన్నారు. రాజధాని అమరావతిని మూడు రాజధానుల పేరుతో నిర్వీర్యం చేశారన్నారు. పోలవరం ప్రాజెక్టును 72 శాతం చంద్రబాబు హయాంలో పూర్తిచేస్తే మిగిలింది చేయ లేకపోయాడన్నారు. ఐదేళ్లలో జగన్ విధ్వంసం తప్ప ఏమీ చేయలేదన్నారు. టిడ్కో గృహాల సముదాయంలో మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. తాగునీరు, విద్యుత్, సీసీ రోడ్లు, మెయిన్‌రోడ్ నుంచి టిడ్కో గృహాల వరకు టీటీ రోడ్డు నిర్మాణాలు వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గత ఐదే ళ్లుగా ఏమి పట్టించుకోకుండా వదిలేసిన పనులను 3 నుంచి 4 నెలల్లో పూర్తి చేసి అందజేస్తామన్నారు. జగనన్నకాలనీలో సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. ఇంకనూ సొంతిళ్లు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం అందజేస్తామన్నారు. ఇళ్లు లేని ప్రతి ఒక్కరికి ఇళ్లు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమని రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, బి.వి. ముత్యాలరావు, నాదెళ్ల శ్రీరామ్, తహశీల్దార్ కె.మస్తాన్, మునిసిపల్ మేనేజర్ రాధాకృష్ణ, టిడ్కో గృహాల ఏఈ పి.సూర్యకుమారి, పెనుమాక జయరాజు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న.. ఇళ్లే టార్గెట్

- జిల్లాలో రెచ్చిపోయిన దొంగలు.. వరుస చోరీలు
- రాజానగరంలో రెండు చోట్ల.. పాలంగిలో దోపిడీ
- 78 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ

రాజానగరం, జూన్ 18 : దొంగలు రెచ్చిపోతున్నారు.. తాళం వేసి ఉన్న ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. జిల్లాలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రాజానగరంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి తాళం వేసి ఉన్న ఇళ్లలో విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటుగా, నగదును దొంగలు దోచుకున్నారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. స్థానిక వైఎస్సార్ కూడలి సమీపంలో కీర్తన ఇటీవల ఇంటికి తాళాలు వేసి ఊరెళ్లారు. ఇది గమనించిన దొంగలు రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో భద్రపర్చిన 60 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.26 వేలు నగదు అపహరించారు. మరో ఇంట్లో ప్రవేశించినప్పటికి ప్రయోజనం లేక వెళ్లినట్టు బాధితులు తెలిపారు. మునసావారి వీధిలో రఘువంశరెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లడంతో తాళాలు బద్దలు కొట్టి ఇంట్లో బంగారు ఆభరణాలు దోచుకున్నారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో పక్కింటివాళ్లు మంగళవారం యజమానికి ఫోన్ చేసి సమాచారం అందించారు.యజమాని ఇంటి వచ్చి చూసే సరికి బీరువాలో భద్రపర్చిన 4 కాసుల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు నగదు,వెండి పూజా సామగ్రి అపహరణకు గురైనట్టు గుర్తించారు. బాధి తులు మంగళవారం ఫిర్యాదు చేసినట్టు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

పాలంగిలో నగదు, బంగారం అపహరణ

ఉండ్రాజవరం, జూన్ 18 : మండలంలోని పాలంగి గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన చోరీలో బంగారం, నగదు చోరీకి గురయ్యాయి. పాలంగి ఎన్టీఆర్ విగ్రహం ఎదుట కొమ్మర విజయకుమార్ కుటుంబంతో నివాసం ఉంటున్నారు. వెల్డింగ్ పనుల నిమిత్తం విజయకుమార్ హైదరాబాద్ వెళ్లాడు. అతని భార్య ఆశానీలిమ ఇంటికి తాళం వేసి తన పిల్లలను తీసుకుని మండలంలోని చిలకపాడు పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గమనించిన దుండగులు సోమవారం రాత్రి ఇంటి తాళాలు, బీరువా పగులగొట్టి రూ.60 వేల నగదు, 14 గ్రాముల బంగారం, 20 తులాలు వెండిపట్టీలు దోచుకెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఉండ్రాజవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక దోపిడీ.. ఆపలేరా!?



- ఆగని ఇసుక దందా
- యథేచ్ఛగా తరలింపు
- పట్టించుకోని అధికారులు
- ఎమ్మెల్యే ఆదేశాలూ బేఖాతర్

ఉన్నతాధికారులే గోదావరిలో ఇసుక అక్రమ దోపిడీ సాగడం లేదని కితాబిస్తే.. ఇసుకాసురులు మాత్రం ఏం చేస్తారు..తమ పని తాము చేస్తారు.. ఎందుకంటే అక్రమ దోపిడీ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని.. ప్రస్తుతం అదే చేస్తున్నా రు.. అడ్డూ అదుపూ లేకుండా ఇసుక దోపిడీకి తెగబడుతున్నారు.. ప్రభుత్వం మారినా ఇసుకాసు రుల తీరు మాత్రం మారలేదు.సాక్షాత్తు రాజమ హేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి హెచ్చరించినా అదే తీరు.. ఈ దోపిడీని కూటమి పాలకులు ఎలా అడ్డుకుంటారో చూడాల్సిందే..

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 18 : ఇసుకాసురుల ఇష్టారాజ్యమైపోయింది.. ప్రభుత్వం మారినా వారి తీరు మాత్రం మారడంలేదు. ఎవరేం చేస్తారులే అన్నట్టు దోపిడీకి తెగబడుతు న్నారు.ఇటీవల కొవ్వూరు రెండు లారీలను పట్టుకున్న సంఘటన విధితమే.అధికారులు కేవలం డ్రైవర్లపై కేసులు నమోదు చేసి ఇసుక దోపిడీదారులను వదిలేశారు. దీంతో నూతన ప్రభుత్వ ఇసుక పాలసీ రాకుండానే అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలో ఇసుక ర్యాంప్‌ల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు.గత ప్రభుత్వంలో అలవాటైపోయిందో ఏమో కానీ అధికారులు చోద్యం చూస్తున్నారు.అయితే గతంలో వందల కొద్దీ లారీల ఇసుక తరలించగా నేడు మాత్రం ఒకట్రెండు లారీలు చాటుమాటుగా తిరుగుతున్నాయి.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్..

కూటమి ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ వచ్చే వరకు ఇసుక విక్రయాలు చేయరాదని ఇటీవల రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఇటీవల ఆదేశాల జారీ చేశారు. ఆయన ఆదేశాలను బేఖాతరు చేసి మరి ఇసుక మాఫియా రెచ్చిపోతుంది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలోని కడియం మండలం బుర్రిలంక, రూరల్ మండలంలోని గాయత్రి తదితర ఇసుక ర్యాంపులు ఉన్నాయి. సుమారు 20 వరకూ అధికార, అనధికార ర్యాంపులు ఉంటాయి. గత ఐదేళ్ల ఆయా ర్యాంపుల్లో ఇసుకను రాత్రీ పగలూ లేకుండా తరలించేశారు. అనధికార డ్రెడ్జింగ్ చేశారు. ఎన్నికలకు ముందు అక్కడకక్కడా ఇసుక కొండలను పెట్టారు. కడియం మండలం బుర్రిలంక, రాజమహేంద్రవరం ఎస్పీ కార్యాలయం పక్కన తదితర ప్రాంతాల్లో ఇసుక కొండలు వెలిశాయి. ఆయా ప్రాంతాల నుంచి ఇప్పుడు రాత్రి సమయంలో అక్రమ వ్యాపారం చేస్తున్నాయి.

రాత్రి దోపిడీ.. పగలు అమ్మకం..

కూటమి ప్రభుత్వం ఇంకా ఇసుక పాలసీని ప్రకటించలేదు. ప్రభుత్వం ప్రకటించాక అప్పుడు ఆ విధానం ప్రకారం ఇసుక సరఫరా చేయాలి. కాని రూరల్‌లో ఇసుకాసురులు దోపిడీకి అడ్డూ అదుపూలేదు. కొంత మంది చోటామోటా నాయకులు అప్పుడే ఇసుకలో చక్రతిప్పుతున్నట్టు తెలిసింది. సాక్షాత్తు ఎమ్మెల్యే గోరంట్ల ఇసుక సరఫరా నిలిపివేయాలని ప్రకటించినప్పటికి ఈ దందా ఆగకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఎమ్మెల్యే దష్టికి వెళ్లకుండానే కొంత మంది అధికారులు ఈ తతంగం నడుపుతున్నట్టు విమర్శలు ఉన్నాయి. కడియం మండలంలోని బుర్రిలంక, వేమగిరి, ధవళేశ్వరంలోని గాయత్రి, కోటిలింగాలు రేవులు, కాతేరు పది రేవులు, వెంకటనగరం రేవులు ఇలా అన్ని రేవులు ఇసుకను బయటకు డంప్ చేసి అక్కడ నుంచి అక్రమంగా తరలించి దానిని తిరిగి అక్రమ రవాణా చేస్తున్నారు. దోపిడీ పెద్ద ఎత్తున జరుగుతున్నా అడ్డుకునే వారే లేకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వం మారిన ఇసుక అక్రమ వ్యవహారాల్లో మార్పురాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భర్త దాడి.. భార్య మృతి 7

లారీ ఢీకొని ఒకరి మృతి

కొమ్మనాపల్లిలో తగ్గాయి..బెండపూడిలో పెరిగాయి

- మరో గ్రామంలో డయేరియా కేసులు
- వైద్య సిబ్బంది అప్రమత్తం


సిబ్బందితో మాట్లాడుతున్న గాయత్రీదేవి

తొండంగి, జూన్ 18: కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో గత వారం రోజులుగా నమోదవుతున్న డయేరియా కేసుల ఉధృతి తగ్గి కనిష్ఠ స్థాయికి చేరుకోగా ఈ దశలో కొత్తగా బెండపూడిలో 18 డయేరియా కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. కొమ్మనాపల్లిలో సుమారు వంద కేసులు వరకూ నమోదు కావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం అంతా మకాం వేసి వారం రోజులుగా స్థానికంగాను, కాకినాడ జీజీహెచ్‌లోను రోగులకు చికిత్స అందించడంతో మంగళవారానికి తీవ్రత మూడు కేసులకు తగ్గింది. కాకినాడ నుంచి సుమారు 25 మంది జీజీహెచ్ నుంచి, మరో 15 మంది ప్రైవేటు ఆసుపత్రుల నుంచి రిలీవ్ అయ్యారు. అధికార యంత్రాంగం, ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో బెండపూడి గ్రామంలో భారీగా డయేరియా కేసులు నమోదు కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. బెండపూడి సబ్ సెంటర్‌లో 10 మందికి చికిత్స అందించి మరో 8 మందిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. సబ్‌సెంటర్‌లో బెడ్ అందుబాటులో లేకపోవడంతో కుర్చీలలోనే పడుకోబెట్టి సెలైన్ పెడుతున్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సరిత గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ టి.గాయత్రిదేవి రోగుల్ని పరామర్శించి వైద్యులతో సమావేశమయ్యారు. వ్యాధి వ్యాప్తికి గల కారణాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కొమ్మనాపల్లి వైద్య శిబిరంలో డాక్టర్ రవికుమార్ డాక్టర్ భారతి రోగులకు చికిత్స అందించారు. బెండపూడి గ్రామంలో నూతి నీటిని తాగునీటిగా ఉపయోగించడం వలనే డయేరియా వ్యాప్తి చెంది ఉంటుందని భావించి ఆ నీటిని ఉపయోగించవద్దని నోటీసు అంటించి చుట్టూ కంపతో మూసివేశారు.

తాగునీటి వనరుల పరిశుభ్రతకు ప్రత్యేక డ్రైవ్

డయేరియా వంటి సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాగునీటి వనరులు పరిశుభ్రతకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ గాయత్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె డయేరియా ప్రభావిత గ్రామాలైన కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో ఆ శాఖ అధికార బృందంతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాగునీటి వనరుల శుభ్రతకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని తమ శాఖ అధికారులను ఆదేశించామన్నారు. దీనిలో భాగంగా గతంలో ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరిచిన తేదీతో సంబంధం లేకుండా అన్ని ట్యాంకులను శుభ్రపర్చడం, ప్రజలకు వెళ్లే ప్రతి నీటి చుక్కను క్లోరినేషన్ చేసి అందించడం ,పైప్‌లైన్ లీకులు, ఇతరత్రా ఎటువంటి లీకులు లేకుండా చూడడం కార్యక్రమ ఉద్దేశమన్నారు. అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం అమలు జరుగుతుందన్నారు. తాగునీరు,ఆహార కాలుష్యం కారణంగా డయేరియా వ్యాధి ప్రబలుతుందని. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కొమ్మనాపల్లి గ్రామంలో కొన్ని ప్రాంతాల్లోని నీటి శాంపిళ్లు తాగడానికి అనువైనది గాను మరికొన్ని ప్రాంతాల్లో అనువైనది కాదని రిపోర్టు వచ్చినందున ఆయా ప్రాంతాల్లో రక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు దళిత వాడలో కొత్తబోరు ఏర్పాటు చేస్తామన్నారు. వ్యాధి బాధితులు ఉన్న వీధిలో పర్యటించి వ్యాధి వ్యాప్తికి గల కారణాలను పరిశీలించారు. అనంతరం ఆమె బెండపూడిలో అధికారలతో సమావేశమయ్యారు. ఆమె వెంట ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ భారతి, డీఈ కోసాన రాంబాబు, జేఈ ఎ.శివాజీ ,రమ్య అనూష, బెండపూడి టీడీపీ, జనసేన నేతలు సాధనాల నూకరాజు, బెండపూడి నాయుడు తదితరులు ఆమె వెంట ఉన్నారు.


బావిని పరిశీలిస్తున్న అధికారులు

1200 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత


పోలీస్‌స్టేషన్‌లో బియ్యం మూటలు

తుని రూరల్, జూన్ 18: కాకినాడ జిల్లా తుని రూరల్ మండలం దొండవాక గ్రామంలో ఎండీయూ ఆపరేటర్ ఇంటి నుంచి సుమారు 1200 కిలోల పీడీఎస్ బియ్యం గుట్టు చప్పుడు కాకుండా తరలించేయడంతో గమనించిన గ్రామస్తులు పీడీఎస్ బియ్యంతో ఉన్న ఆటోను అడ్డగించారు. అనంతరం సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వగా రూరల్ పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆటోను సంబంధిత డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై పోలీసులను వివరణ కోరగా పీడీఎస్ బియ్యం పట్టుబడటం విధితమేనని దీనిపై కేసు నమోదు చేసి ఎవరు విక్రయించారు, ఎక్కడకు వెళుతున్నాయనే దానిపై వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

ద్రాక్షారామ, జూన్ 18: రామచంద్రపురం మండలం ఓదూరు రైల్వే క్రాసింగ్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేళంగి గ్రామానికి చెందిన యరమాటి కృష్ణచైతన్య చౌదరి (16) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేళంగి గ్రామానికి చెందిన కృష్ణ చైతన్య చౌదరి తన సోదరుడు షాపు ముందు పార్కు చేసిన హీరో హోండా మోటారు సైకిల్‌ను ఎవరికీ చెప్పకుండా తీసుకుని సోమవారం రాత్రి 6.50 గంటల సమయంలో వేళంగి నుంచి రామచంద్రపురం వైపు బయలుదేరాడు. ఓదూరు రైల్వే క్రాసింగ్ వద్దకు వచ్చే సరికి స్పీడ్ బ్రేకరు వద్ద మోటారు సైకిల్ అదుపు తప్పి పడిపోగా స్పృహ కోల్పోయాడు. తెలిసిన వ్యక్తులు కృష్ణ చైతన్యచౌదరి పెదనాన్నకు సమాచారం అందించారు. దీంతో కృష్ణచైతన్య పెదనాన్న వేళంగి ఆర్ఎంపీ వైద్యుని వద్దకు తీసుకువెళ్లి అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రామచంద్రపురం ఎస్ఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డుగోడ కూలింది..

- ఆంజనేయనగర్ వాసుల కళ్లల్లో ఆనందం
- గత వైసీపీ పాలనలో దారికి అడ్డంగా గోడ
- ఎమ్మెల్యే నల్లమిల్లి సమక్షంలో తొలగించిన వైనం


గోడ కూల్చుతున్న ఎక్సకవేటర్


ఎమ్మెల్యే నల్లమిల్లి దగ్గర ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు

అనపర్తి, జూన్ 18: అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో అధికారులు అనపర్తిలోని ఆంజనేయ నగర్ వాసుల రాకపోకలకు అడ్డుగా ఉన్న ప్రహరీని మంగళవారం తొలగించారు. దీంతో కాలనీ వాసులు ఎమ్మెల్యే నల్లమిల్లికి కృతజ్ఞతలు తెలిపారు. అనపర్తిలోని ఆంజనేయనగర్ వాసులు 40 సంవత్సరాలుగా ఉపయోగిస్తున్న రోడ్డును హైస్కూల్ ప్రహరీ నిర్మాణం పేరుతో వైసీపీ నాయకులు దారిని మూసివేశారు. గోడ నిర్మాణం చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు కలిగించారు. ఈ నేపథ్యంలో అదే కాలనీకి చెందినకర్రి అరుణకుమారి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. కాలనీ వాసులు ఉపయోగిస్తున్న రోడ్డుకు ఇబ్బంది లేకుండా సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడతామని అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హామీ ఇచ్చి చివరకు పోలీసుల సహాయంతో ఎవ్వరినీ దరి చేరనీకుండా రోడ్డు మూసివేస్తూ గోడ నిర్మించారని దీనితో తాను గుడికి వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని కాలనీకి చెందిన అరుణకుమారి ఆత్మహత్యకు పాల్పడింది. అంతే కాకుండా తన ఆత్మహత్యకు ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి కారణమంటూ ఆమె సూసైడ్ నోట్ రాయడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. దీంతో ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబానికి, కాలనీ వాసులకు అండగా నిలవడమే కాకుండా తాము అధికారం చేపట్టగానే ప్రహరీ అడ్డంకి తొలగించి కాలనీ వాసులకు రహదారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే సమావేశం నిర్వహించి ముఖ్యంగా ఆంజనేయరెడ్డి నగర్ వాసుల ఇబ్బందులు, పరిసరాల్లో ఆక్రమణలపైనా చర్చించారు. అనంతరం ఆంజనేయరెడ్డి నగర్‌కు అధికారులతో చేరుకున్న ఎమ్మెల్యే కాలనీ వాసులకు రహదారి కల్పించాలని నిర్ణయించారు. దీంతో అధికారులు జేసీబీతో కాలనీలోని రోడ్లకు అడ్డుగా ఉన్న ప్రహరీని ప్రధాన రహదారికి అనుసంధానం చేసే చోట ఉన్న ప్రహరీని తొలగించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న కాలనీ వాసులు ఎమ్మెల్యే నల్లమిల్లికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఆత్మహత్యకు పాల్పడిన అరుణకుమారి భర్త సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కాలనీ వాసులకు రహదారి ఏర్పడటంతో తన భార్య ఆత్మ శాంతించిందని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, బాసి, కృష్ణారెడ్డి, సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు మల్లిడి ఆదినారాయణరెడ్డి, మల్లిడి పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి




రాజు(ఫైల్‌ఫోటో)

కడియం, జూన్ 18: జాతీయ రహదారిపై కడియం మండలం పొట్టిలంక వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పొట్టిలంక వీవర్స్ కాలనీకి చెందిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పొట్టిలంక వీవర్స్ కాలనీకి చెందిన బీరక రాజు(44) మోటారుసైకిల్‌పై సెంటర్‌కు వెళుతూ హైవే రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో రావులపాలెం నుంచి వేమగిరి వైపు వెళుతున్న లారీ ఢీకొంది. దీంతో రాజు తలకు తీవ్రగాయం అయింది. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బీరక రాజు భార్య లక్ష్మీవెంకట సంధ్య ఫిర్యాదు మేరకు కడియం ఎస్ఐ బి.నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం


భవాని(ఫైల్)

రాజానగరం, జూన్ 18 : తోటికోడలు ఆకస్మిక మృతితో మానసిక ఆందోళనకు గురైన వివాహిత సోమవారం తెల్లవారు జామున ఇంటి నుంచి అదృశ్యమైంది. రాజానగరం మండలం తూర్పుగోనగూడెం గ్రామంలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గళ్లా భవాని అనే మహిళ ఈ నెల 17న తెల్లవారుజామున ఎవ్వరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. బయటకు వెళ్లే సమయంలో మెడలో ఉన్న పుస్తెలతాడు, చెవి దిద్దులు తీసి ఇంట్లోనే వదిలివెళ్లింది. భవాని తోటి కోడలు అనారోగ్యంతో ఈ నెల 14న అకస్మాత్తుగా మృతిచెందింది. అప్పటి నుంచి మానసిక ఆందోళనతో గడుపుతున్న భవానీ సోమవారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో వెళ్లిపోయింది. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో నీలం రంగు చీర, జాకెట్టు ధరించి ఉన్నట్లు ఆమె కుమార్తె దేవి చెప్తోంది. బంధువుల ఇంటి వద్ద పరిసర ప్రాంతాల్లో గాలించిన ఆచూకీ లభించలేదు. భవాని అల్లుడు భూషంశెట్టి వీరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాజానగరం పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని సీఐ పి.కాశీవిశ్వనాథ్ కోరారు.

ఘనంగా పండిత సదస్యం


పండిత సదస్యం నిర్వహిస్తున్న దృశ్యం

మామిడికుదురు, జూన్ 18: అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాల్లో భాగంగా పండిత సదస్యం కార్యక్రమాన్ని మంగళవారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి మంగళవారం స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, సహస్ర నామార్చన, బాలభోగ నివేదన, నిత్య హోమం, బలిహరణ, తీర్థప్రసాద గోష్ఠి, చతుష్టానార్చనలు, వేద పారాయణం, మంగళాశాసనములు తదితర కార్యక్రమాలతో వేద సదస్యం(పండిత సన్మానాన్ని) ఘనంగా జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మామిడికుదురుకు చెందిన యింటి శ్రీరామ్‌కుమార్, సుజాత ఆలపించిన అన్నమాచార్య సంకీర్తన విభావరి, అప్పనపల్లికి చెందిన శేష శారద భక్త బృందం వారు ఆలపించిన పురందరదాసు కీర్తనలు, మానేపల్లికి చెందిన ప్రకాశ్ గురుస్వామి భజనా కార్యక్రమం భక్తులను రంజింపచేశాయి. ఈ కార్యక్రమాలన్నీ ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి పర్యవేక్షణలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజీ మార్గంతో సమయం ఆదా




మాట్లాడుతున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, రాజీ మార్గంతో సమయం ఆదా అవుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. న్యాయవాదులకు నిర్వహించే మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మధ్యవర్తిత్వం ద్వారా త్వరితగతిన ప్రయోజనం సమకూరుతుందన్నారు. ఖర్చు లేకుండా సామరస్య పూర్వకంగా కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఐదు రోజుల్లో 40 గంటల పాటు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన న్యాయవాదులకు బెంగళూరుకు చెందిన ప్రొటెన్షియల్ ట్రైనర్స్ గీతాదేవి, బి.శ్రీకుమార్, చెన్నైకి చెందిన సీనియర్ ట్రైనర్ ఆర్.విజయ కమల మధ్యవర్తిత్వ నైపుణ్య శిక్షణ అందిస్తారన్నారు. ఈ నెల 26వ తేదీ వరకూ శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.గాయత్రి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గోగన్న మఠంలో అగ్నిప్రమాదం


మంటలు ఆర్పుతున్న సిబ్బంది

మామిడికుదురు, జూన్ 18: గోగన్నమఠం గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కురుడీ కొబ్బరి రాశులు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన అల్లు సురేష్ బాబు కొబ్బరికొట్టులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కురుడీ కొబ్బరికాయల రాశులు అంటుకున్నాయి. రాజోలు అగ్నిమాపక దళం వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. సుమారు రూ.2 లక్షల కురుడీ కొబ్బరి కాయలు ప్రమాదంలో దగ్ధమయ్యాయని బాధితుడు పేర్కొన్నాడు.


కాలిపోయిన కొబ్బరికాయలు

మొక్కల పెంపకంలో ఖైదీలకు శిక్షణ


స్వాతికి మొక్క అందిస్తున్న సూపరింటెండెంట్ రాహుల్

రాజమహేంద్రవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఖైదీలకు మొక్కల పెంపకంలో ఈ నెల 18 నుంచి 30 వరకూ శిక్షణ ఇస్తున్నామని సూపరింటెండెంట్ రాహుల్ తెలిపారు. వివిధ రకాల పండ్లు, పూలు, క్రోటాన్స్ మొక్కల పెంపకంలోని మెలకువలను నేర్పిస్తున్నామన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యానవన విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ కె.స్వాతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కలను అభివృద్ధి చేయడం తద్వారా ఉపాధి పొందడాన్ని వివరించారు. మొక్కల పెంపకంలో కృషి ఎంత ఉంటే అంతగా సంపాదన ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ రాజ్ కుమార్, మునిసిపల్ ఉద్యానవన ఉద్యోగి బాలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి




కొత్తపల్లి, జూన్ 18: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమీనాబాద్ బీచ్‌రోడ్డు సమీపంలో మంగళవారం ఓ మత్స్యకారుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొండంగి మండలానికి చెందిన మైలపల్లి ఎల్లయ్య(53) ప్రతీరోజూ వేట చేసేందుకు అమీనాబాద్ రేవుకు వచ్చి వెళుతుంటాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పెట్రోలు బంక్ సమీపంలో ఎల్లయ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మండపేటలో యువకుడి ఆత్మహత్య


నాగదుర్గాకుమార్

మండపేట, జూన్ 18: మండపేటలో ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని గొల్లపుంతకు చెందిన సోము నాగదుర్గాకుమార్ (19) పబ్జిఫైర్ ఫ్రీగేమ్ సెల్‌ఫోన్‌లో ఆడుతుంటాడు. ప్రసాద్ తాపీ పని చేస్తుంటాడు. అయితే ఏమైందో తెలియదు కానీ మంగళవారం పనికి వెళ్లి ఇంటికి వచ్చి రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ప్రసాద్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఆసుపత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు జరిగిన సంఘటనపై ఆరా తీస్తున్నామని పట్టణ సీఐ అఖిల్‌జమా, ఎస్ఐ హరికోటి శాస్త్రి తెలిపారు. యువకుడి ఆత్మహత్యపై కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

భర్త దాడిలో భార్య మృతి


మృతిచెందిన మహిళ

కాట్రేనికోన, జూన్ 18: అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పొర గ్రామానికి చెందిన అర్ధాని కస్తూరి(36) భర్త కొట్టడంతో మృతి చెందింది. తన భర్త సతీష్ వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో మంగళవారం కస్తూరి సతీష్‌ను నిలదీసింది. ఆగ్రహించిన సతీష్ సాయంత్రం భార్యను కొట్టాడు. ఈ దెబ్బలకు కస్తూరి మృతి చెందింది. కస్తూరి తల్లి బలుసుతిప్పకు చెందిన సంగాని కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

రత్నగిరి ప్రకాష్ సదన్‌లో నల్లుల బెడద

- ఏసీ గదుల్లో సైతం నల్లుల బాధే
- బస చేయడానికి వచ్చిన భక్తులు అసహనం
- అయినా పట్టించుకోని పారిశుధ్య విభాగం



అన్నవరం, జూన్ 18: సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు బస చేయాలంటే ముందుగా గుర్తొచ్చేది ప్రకాష్‌సదన్ కాటేజీ.. ఎందుకంటే బస చేసే భక్తులకు ఆహారం, ఇతర అవసరాలకు దగ్గర్లో దుకాణ సముదాయాలు ఉండడం, ఆలయానికి దగ్గరగా ఏసీ గదులతో ఉన్న కాటేజీ కావడంతో ఎవరైనా ముందుగా ప్రాధాన్యమిచ్చేది ఈ కాటేజీకి మాత్రమే. ప్రముఖుల సిఫార్సు లేఖలకు, పాలకమండలి సభ్యులు విచ్చేసినా ఈ కాటేజీలోనే బస ఏర్పాటు చేస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కాటేజీలో ప్రస్తుతం బస చేయాలంటే నరకం అనుభవించాల్సి వస్తుందని భక్తులు గగ్గోలు పెడుతున్నారు. దీనికి ప్రధాన కారణం నల్లులు ఆవాసంగా ఉండడమే. అయితే ఈ నల్లులు గతంలో ప్రతి ఇంట్లో ఉండేవి కానీ ఇప్పుడు ఎక్కడా వీటి జాడ కనపడకపోయినా ప్రకాష్‌సదన్ కాటేజీలో మాత్రం విరివిగా ఉన్నాయి. 84 గదులున్న ఈ కాటేజీలో గది తీసుకోవాలంటే ప్రస్తుతం భయపడుతున్నారు. రోజుకు సుమారు 80 వేలరూపాయలు అద్దె వచ్చే కాటేజీ అయినా నల్లుల నిర్మూలనకు శానిటేషన్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడం విచారకరం. నాలుగు అంతస్తులలో ఉన్న ఈ కాటేజీలో వారానికి ఒక్కొక్క ఫ్లోర్ భక్తులకు అద్దెకివ్వకుండా నివారణ చర్యలు చేపట్టే మార్గం ఉన్నా ఆ దిశగా శానిటరీ వర్కర్లు ప్రయత్నించే దాఖలాలు కనబడడం లేదు. ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి భక్తులను నరకయాతన నుంచి బయటపడేలా చేయాలని కోరుతున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా నల్లులు ఉన్నమాట వాస్తవమేనని గతంలో కెమికల్స్ వేసి చర్యలు చేపట్టినా నిర్మూలన కాలేదని ఈ కాటేజీలో వారం రోజులు పాటు పూర్తిగా గదులు అద్దెకివ్వకుండా ఉంటే ప్రత్యేక చర్యల ద్వారా శాశ్వతంగా నిర్మూలించవచ్చునని అన్నారు.

ఏజెన్సీ సమాచారం

వైభవంగా ముగిసిన జాతర



గుండం తొక్కుతున్న భక్తులు



జాతరను తిలకించేందుకు వచ్చిన భక్తులు

వరరామచంద్రాపురం, జూన్ 18: గత పది రోజులుగా రేఖపల్లిలో జరుగుతున్న కొర్రాజుల, పెద్ద, సార్లమ్మ, చిన్న సార్లమ్మ జాతర మహోత్సవ కార్యక్రమం మంగళవారం అత్యంత వైభవంగా ముగిసింది. నాయకపోడు గిరిజనుల ఆరాధ్య దైవమైన దేవతామూర్తుల జాతర మహోత్సవం ప్రతీ మూడేళ్లకొకసారి నిర్వహిస్తారు. దేవతామూర్తులను (పెద్ద,చిన్న సార్లమ్మ) నాలుగు రోజుల ముందుగానే అడవి నుంచి జాతర జరిగే ఆలయానికి తీసుకువచ్చి ప్రతిరోజు రాత్రి దేవారుల నడుమ జాతర నిర్వహించారు. సోమవారం సరగులను మేళతాళాల నడుమ, పూజారి పాండురాజు సమక్షంలో ఊరేగించారు. చివరి రోజు మంగళవారం జాతర జరుగు ప్రదేశంలో నిప్పుల గుండం తయారు చేయగా భక్తులు గుండాన్ని తొక్కుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతర మహోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాలైన వీఆర్‌పురం, వడ్డిగూడెం, రాజుపేట, సీతంపేట, శ్రీరామగిరి, ఉమ్మడివరం, అన్నవరం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

పారిశుధ్యం, తాగునీటి పనులపై దృష్టి సారించాం

వై.రామవరం, జూన్ 18: మండలంలో పారిశుధ్యం పనులు, తాగునీరు కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ముందస్తు చర్యలుగా మురికికూపాల వద్ద నీటి నిల్వల ప్రదేశాల్లో బ్లీచింగ్, స్ప్రేయింగ్ చేపట్టాలన్నారు. అపారిశుధ్య వాతావరణాన్ని పూర్తిగా పారదోలేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి ఆదేశించినట్లు తెలిపారు. పలు గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారించి సురక్షితమైన నీటిని ప్రజలకు అందించే ధ్యేయంతో పనిచేయాలని తద్వారా ఆరోగ్య సమస్యలను నిర్మూలించాలని సూచించారు.

ఎండతో ఇబ్బందులు

మోతుగూడెం, జూన్ 18: చింతూరు మండలం మోతుగూడెం ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ వాతావరణంలో మాత్రం మార్పు కనిపించడం లేదు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు చాలా తీవ్రంగా ఉంటున్నాయి. ఉపాధి పనులకు వెళ్లేవారు 9 గంటలకే ఇంటి ముఖం పడుతున్నారు. మోతుగూడెం రహదారులపై రాకపోకలు సాగించేవారు ఎండ ధాటికి తట్టుకోలేక తలకు వస్త్రాలు చుట్టుకుని కొంత మంది గొడుగులు పట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుకాణాలు మధ్యాహ్నం 12 గంటలు కల్లా మూసేస్తున్నారు. ఎండ వేడిమికి వృద్ధులు, చంటి పిల్లలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ వేడిమి తాళలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

బాధితులకు అందుబాటులో ఉండాలి



సమీక్షలో మాట్లాడుతున్న జడ్పీటీసీ రంగారెడ్డి

వరరామచంద్రాపురం, జూన్ 18: గోదావరి వరదల సమయంలో అధికారులందరూ వరద బాధితులకు అందుబాటులో ఉండాలని జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం రేఖపల్లిలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో అధికారులతో జరిగిన ముందస్తు గోదావరి వరదల సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. వరదలకు ముందుగానే బాధితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస కేంద్రాల వద్ద తప్పనిసరిగా చేతిపంపులు వేయించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నిత్యావసర వస్తువులను ముందుగానే నిల్వ ఉంచుకోవాలన్నారు, ప్రతి వరద బాధితుని కుటుంబానికి తప్పనిసరిగా టార్పాలిన్లు పంపిణీ చేయాలన్నారు. పునరావాస కేంద్రాల వద్ద సోలార్‌లైట్లు కూడా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణీంద్రరెడ్డి. తహశీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్, ఎస్‌ఐ నాగరాజు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులు



దేవీపట్నం, జూన్ 18: మండలంలో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దేవారం గ్రామంలో లాయర్ కొమరం రామకృష్ణదొర ఇంటి వద్ద కొబ్బరిచెట్టుపై పిడుగుపడి చెట్టు కాలిపోయింది. అలాగే వీరి ఇంటి దగ్గర ఉన్న పందిరికి మంటలు అంటుకున్నాయి. వర్షం కురవడంతో మంటలు ఆరిపోయాయి. గొందూరు గ్రామంలో కూడా పిడుగులు పడ్డాయి.

కూటమి నాయకుల బైక్ ర్యాలీ



సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు

దేవీపట్నం, జూన్ 18: జనసేన అధినేత కొణిదల పవన్‌కల్యాణ్ బుధవారం డిప్యూటీ సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేటలో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

రాజమహేంద్రవరంలో పచ్చదనాన్ని పెంచాలి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 18 : రాజమహేంద్రవరంలో మొక్కలు బాగా పెంచి పచ్చదనాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉందని కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. నగరంలో పలు డివిజన్లలో మంగళవారం ఆయన పర్యటించి పారిశుధ్యం పరిశీలించారు. డివైడర్లలో నాటిన మొక్కలను చూసి మాట్లాడారు. ప్రధానరోడ్లలో డివైడర్ల అన్నింటిలోను నాటిన మొక్కలను పరిరక్షించాలన్నారు. వర్షాకాలంలో మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్రెయినేజీల్లో సిల్ట్‌ను వెంటనే తీసి తరలించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు.

విద్యా వ్యవస్థను నాశనం చేసిన వైసీపీ

● 'నేను బడికి పోతా' కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



జెండా ఊపి నేనుబడికిపోతా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 18 : గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యావ్యవస్థను పాడు చేసిందని రాజమహేంద్రవరం కూటమి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రాంగణంలో మంగళవారం 'నేను బడికి పోతాను' కార్యక్రమానికి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం పంతులు విగ్రహానికి డీఈవో వాసుదేవరావు, డీఐ దిలిప్ కుమార్‌లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యను మరింతగా పటిష్ఠం చేస్తామన్నారు. విద్యాకానుక పేరిట 120 కోట్లు నిధులు గత ప్రభుత్వం దారి మళ్లించిందని కూటమి మంత్రి నాదెండ్ల మనోహర్ తాజాగా ప్రకటించారని గుర్తుచేశారు. ఐదేళ్లలో ఎస్సీ, బీసీ వసతి గృహాలను పూర్తిగా పాడు చేసిందన్నారు. తాము అధికారంలో వచ్చాక కిమ్స్ బొల్లినేని సహకారంతో బీసీ వసతి గృహాల్లో 50 టాయిలెట్స్ కట్టిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, మాజీ కార్పొరేటర్లు కోరుమిల్లి విజయశేఖర్, కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, కోసూరి చండీప్రియ, కప్పలవెలుగు కుమారి, కడలి రామకృష్ణ, మరుకుర్తి రవి యాదవ్, నక్కా దేవివరప్రసాద్, దాస్యం ప్రసాద్, మజ్జి రాంబాబు, మాలే విజయలక్ష్మి, మీసాల నాగమణి, నాయకులు శెట్టి జగదీష్, చాపల చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

మన ఊరి బడి - మన పాలిట గుడి



కడియం ఉన్నత పాఠశాలలో ర్యాలీ

కడియం, జూన్ 18: ఆంధ్రప్రదేశ్ సర్వశిక్ష ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు నేను బడికి పోతా అనే కార్యక్రమంలో భాగంగా కడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హెచ్‌ఎం టి.సత్యనారాయణ ప్రారంభించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, సువర్ణవేణి, గిరిజ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధులు విడుదల

● కోరుకొండలో 6300 మంది రైతులకు జమ

కోరుకొండ, జూన్18: 17వ విడత పీఎం కిసాన్ పథకం ద్వారా కోరుకొండ మండలంలో 6300 మంది రైతులకు రూ.1.26కోట్లు విడుదలైనట్లు వ్యవసాయశాఖ ఏడీఏ మల్లికార్జునరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కోరుకొండ మండలం రైతు భరోసాకేంద్రం వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. భారత ప్రభుత్వం నరేంద్రమోదీ 17వ విడత పీఎం కిసాన్‌నిధులు విడుదల లైవ్ టెలికాస్ట్ కార్యక్రమాన్ని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ రైతులందరికీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా వారణాసిలో జరిగే కిసాన్ సమ్మేళనంలో ప్రధానమంత్రి ఒక్కో రైతుకు రూ.2వేలు చొప్పున పెట్టుబడి సాయాన్ని విడుదల చేశారని తెలిపారు. అదేవిధంగా రాజానగరం నియోజకవర్గానికి సంబంధించి సీతానగరం మండలంలోని 5049మంది రైతులకు రూ.1కోటి 98వేలు, రాజానగరంలో మండలంలో 8472మంది రైతులకు రూ.1,69,44,000లు పెట్టుబడిసాయం అందించినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ మల్లికార్జునరావు తెలిపారు. మండల వ్యవసాయశాఖాధికారి గౌరీదేవి, గ్రామసర్పంచ్ మద్దాల రమణ, మాజీ ఎంపీపీలు, బుద్దాబాపూజీ పాల్గొన్నారు.

పీఎం కిసాన్ అందిస్తున్న ప్రధాని మోదీ

అనపర్తి, జూన్ 18: రాష్ట్రంలోని రైతులకు మేలు కలిగిస్తూ ప్రధాని నరేంద్రమోదీ ఏడాదికి ఆరువేల చొప్పున పీఎం కిసాన్ భరోసా పేరుతో నిధులు అందిస్తున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తిలోని రైతుభరోసా కేంద్రంలో నిర్వహించిన పీఎం కిషాన్ కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన రైతులతో కలిసి పాల్గొని ప్రధాని మోదీ ప్రసంగాన్ని లైవ్‌లో తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు 12వేలు అందిస్తామని హామీ ఇచ్చి కేంద్రం ఇచ్చే సొమ్ము లతో కలిసి ఏడాదికి రూ.13,500 అందించి రైతులను మోసగించారని అందుకే ఎన్నికలలో రైతుల ఆగ్రహానికి గురై ప్రతిపక్ష హోదా కూడా లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవ దానరెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

జీవో 117ను వెంటనే రద్దుచేయాలి

● ఎస్టీయూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు త్రినాధ్‌బాబు

దివాన్‌చెరువు, జూన్18 : రాష్ట్రంలో విద్యావ్యవస్థను అస్తవ్యస్థం చేసిన జీవో117 ను కొత్త ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని ఎస్టీయూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సూరిజయత్రినాధబాబు విజ్ఞప్తి చేసారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు.సమాజాభివృద్ధికి విద్యావ్యవస్థ ఎంతో కీలకమని అటువంటి విద్యావ్యవస్థకు ఈజీవో గొడ్డలిపెట్టుగా మారిందన్నారు. తమప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ జీవోను రద్దుచేస్తామని ప్రస్తుత రాష్ట్ర మానవవనరుల శాఖమంత్రి నారాలోకేష్ ఎన్నికల సమయంలో తమకుహామీ ఇచ్చారన్నారు. అందుచే త్వరలో జరగనున్న శాసనసభాసమావేశంలో దీనికి అధికప్రాధాన్యత ఇస్తూ ఈ ఉత్తర్వులు వెంటనే రద్దు అయ్యేలా చూడాలని కోరారు. తద్వారా విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని త్రినాధబాబు విజ్ఞప్తి చేసారు.

ప్రాథమిక పాఠశాలలోనే కొనసాగించాలి

ధవళేశ్వరం, జూన్ 18: 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల మాజీ కో ఆర్డినేటర్ యర్రమోతు ధర్మరాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గతంలో 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలోనే బోధించేవారని గత వైసీపీ ప్రభుత్వం 3నుంచి 5వ తరగతి వరకు ఉన్నత పాఠశాలలో విలీనం చేయడంతో కొన్నిప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులులేక మూతపడగా మరికొన్ని ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కు రాసినలేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానంవల్ల దూరంగా ఉన్న పాఠశాలలకు విద్యార్థులు వెళ్లలేని పరిస్థితి నెలకొందని ప్రాథమిక విద్యకు సరాగాతంగా మారిన 117 జీవోను రద్దు చేయాలని లేఖలో ధర్మరాజు విజ్ఞప్తి చేశారు.

గుర్రపు డెక్క తొలగింపు పనుల పరిశీలన



కొంకుదురులో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జూన్ 18: కాకినాడ కాలువలో కొంకుదురు-పైన గ్రామాల మధ్య పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను రెండో రోజైన మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం కాలువలు పూడిక తీత పట్ల నిర్లక్ష్యం వహించడంవల్లే ఈ దుస్థితి దాపురించిందన్నారు. కాలువ పరిధిలో 34వేల ఎకరాల ఆయకట్టు వుందని కాలువలు వదిలినా గుర్రపు డెక్క వల్ల పొలాలకు నీరందడం లేదన్నారు. దీంతో ఉపాధి హామీ కూలీలు 1500 మందితో ఈపనులు చేపట్టామన్నారు. ఈయన వెంట టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, దేశం నేతలు కర్రి శ్రీనివాసరావు, సబ్బారపు సూర్యనారాయణ, సిరసపల్లి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

రంగంపేట, జూన్ 18: రైతులు ఎత్తిపోతల సాగునీటి పొదుపు పద్ధతులను పాటించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎత్తిపోతల పథకాల సమాఖ్య అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి పిలుపు నిచ్చారు.మంగళవారం రంగంపేట మండలం మర్రిపూడి గ్రామంలో జరిగిన ఇళ్ళపల్లి ఐడీసీ ఎత్తిపోతల రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాధారణ నీరుతో పోలిస్తే ఎత్తిపోతల నీరు ఎంతో విలువైందని ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు అందజేయాలంటే పెద్దఎత్తున ఖర్చు అవుతుందన్నారు. ఇళ్ళపల్లి ఎత్తిపోతల ద్వారా 750ఎకరాలకు నీరు అందజేస్తున్నామని ఇందులో మర్రిపూడి ఆయకట్టు ఎకరాలు ఉందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో తోటకూర పద్దయ్య, మోదుకూరి బంగార్రాజు, పుట్టా గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

రంగంపేట, జూన్ 18: ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్రామాల్లో పాఠశాలలు నిర్వహిస్తే ఉపేక్షించేదిలేదని రంగంపేట మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం రంగంపేట మండలం మర్రిపూడి గ్రామంలో శ్రీసూర్యతేజ ప్రీ ప్రైమరీ స్కూల్ పేరుతో ఒక ప్రైవేటు పాఠశాలలో నర్సరీ నుంచి యూకేజీ వరకు తరగతులు నిర్వహిస్తున్న నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ గుర్తింపు అనుమతి వచ్చే వరకు తరగతులు నిర్వహించవద్దని తరగతులు నిర్వహిస్తే ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

● రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరికి కంబాల అభినందన



గోకవరం, జూన్18: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ విజేత దగ్గుబాటి పురందేశ్వరిని మంగళవారం శ్రీనివాసరావుతోపాటు, రామసేన సభ్యులు కలిసి ఎన్నికల్లో భారీ విజయం సాధించడంపట్ల అభినందనలు తెలిపారు. ఈనెల 24న గోకవరంలో జరగబోయే తన మనవడు పుట్టినరోజు వేడుకలకు ఎంపీ పురందేశ్వరిని శ్రీనివాసరావు ఆహ్వానించారు. ఎంపీని అభినందించినవారిలో రామసేన సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, వల్లూరి జగన్నాధశర్మ, బీజేపీ నాయకులు మట్టా మంగరాజు, సత్తి వెంకటరెడ్డి, ఇనగోటి బాపన్నదొర, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే గోరంట్లకు అభినందన



రూరల్ ఎమ్మెల్యే గోరంట్లను సత్కరిస్తున్న ప్రజలు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 18: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన గోరంట్ల బుచ్చయ్యచౌదరిని రూరల్ నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున కలిసి అభినందనలు తెలుపుతున్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని ఆయన నివాసం మంగళవారం ప్రజలతో కిక్కిరిసింది. పిడింగొయ్యి గ్రామానికి చెందిన గంగిరెద్దుల కాలనీ వాసులు 200 మంది, టీడీపీ నాయకులు ఎబెల్ రాజు ఆధ్వర్యంలో గోరంట్ల నివాసానికి చేరుకుని ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, పోలీస్ అధికారులు, వీఆర్‌వోలు, పంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది గోరంట్లను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

'రసాయన రహిత పంటలపై అవగాహన పెంచుకోవాలి'



రంగంపేటలో విద్యార్థినులు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న హెచ్‌ఎం పార్థసారథి

రంగంపేట, జూన్ 18: రసాయన రహిత ఆహార పంటల ఉత్పత్తుల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని రంగంపేట హైస్కూల్ హెచ్‌ఎం వి.పార్థసారధి సూచించారు. మంగళవారం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధ ఆధ్వర్యంలో ఎకోక్లబ్ కృత్యాల తయారీలో భాగంగా ఎడాప్టివ్ సస్టెనబుల్ ఫుడ్ సిస్టం కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహార పదార్థాలపై మంచి అవగాహన కల్పించిన సైన్స్ టీచర్ రమ్యసుధను, పదార్థాలు తయారుచేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మీ, వెంకటలక్ష్మీ, సుభద్ర, అనితారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోతవరం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

నల్లజర్ల, జూన్ 18: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పీహెచ్‌సీ సిబ్బంది అధిగమిస్తున్నారా లేదా అనే అంశంపై మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. వార్షిక బడ్జెట్, ఖర్చులు, రికార్డులు పరి శీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వైద్య సిబ్బంది ఉండి సేవలు అందించాలన్నారు. వైద్య సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి ప్రజల మన్నలను పొందాలన్నారు. డాక్టర్ రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కడియం, జూన్ 18: కడియం మండల పరిషత్ కార్యాలయంలో నేడు ఉదయం 10 గంటలకు ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి హాజరు కానున్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, మండల ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, జనసేన, బీజేపీ నాయకులు హాజరు కావాలని మండల టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్(నాని) తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

సీతానగరం, జూన్ 18: సీతానగరం మండలం సింగవరంలోని నాగరత్నం కాలనీకి చెందిన గండిపోశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వరకట్నం కేసు నమోదు చేసినట్లు సీతానగరం ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు నాగరత్నకాలనీకి చెందిన గండిపోశమ్మకు పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన గోలి రవికుమార్‌తో 2019లో వివాహం జరిగింది. పెళ్లయిన కొంత కాలం నుంచి భర్త రవికుమార్‌తో పాటు అత్తమామలు సుబ్బలక్ష్మి, మోహనరావు, తోటికోడలు అపర్ణ, ఆడపడుచు తాడేపల్లి మనీష, పెద్ద ఆడపడుచు భర్త ధర్మేంద్రలపై అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు

వరి నారు మడుల పరిశీలన

సీతానగర, జూన్ 18: మండలంలోని పలు గ్రామాలలో వరి ఆకుమడులను మండల వ్యవసాయశాఖాధికారి కె.సూర్యరమేష్ పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. మంగళవారం మండలంలోని మిర్తిపాడు, మునికూడలి, ఇనుగంటివారిపేట ముగ్గళ్ళ, రాపాక గ్రామాలలో ఖరీఫ్‌సీజన్‌లో వేసే వరి ఆకుమడులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరినాట్లు వేసే వారంరోజుల ముందు ఐదు సెంట్లు వరి ఆకుమడిలో కిలో కార్బో ఫ్యూడాన్ 3జి గుళికలు వేయాలని, దీంతో 30 రోజుల వరకు ఎటు వంటి పురుగులు ఆశ్రయించవన్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌కు గాను 50 హెక్టార్ల వరకు వరి ఆకుమడులు వేస్తామన్నారు. ఇందులో బీపీటీ, 5204, పీఎల్ఏ 1100, ఎంపీయూ 1318, ఆక్టోబయో 226 రకాల విత్తనాలు వేస్తామన్నారు.

టైలరింగ్ , మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 18: రాజమహేంద్రవరం లాలాచెరువు స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, మగ్గం వర్కులో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. కనీసం చదవడం వచ్చిన వారు శిక్షణకు అర్హులని తెలిపారు. జూన్ 24 నుంచి శిక్షణ ప్రారంభమై 45 రోజులు పాటు ఉంటుందని తెలిపారు. శిక్షణలో ఉచితంగా మెటీరియల్ ఇస్తామని మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిచడంతో పాటు శిక్షణ అనంతరం ఉత్తీర్ణత పత్రాలు అందిస్తామని తెలిపారు. సమాచారం కోసం 98498 47489 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా మర్రెడ్డి పుట్టినరోజు వేడుకలు



బిక్కవోలు జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డికి కేకు తినిపిస్తున్న జనసైనికులు

బిక్కవోలు, జూన్ 18: నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలను సోమవారం రాత్రి బిక్కవోలులో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జనసైనికులు ఏర్పాటు చేసిన కేకును ఆయన కట్ చేయగా, జనసైనికులు ఆయనకు తినిపించారు.

పైడితల్లిని దర్శించుకున్న డాక్టర్ గోరంట్ల



పైడతల్లి అమ్మవారి జాతర మహోత్సవంలో పాల్గొన్న డాక్టర్ రవి రామ్‌కిరణ్

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 17: తుమ్మలావ పైడి తల్లి అమ్మ వారి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్ మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు స్వాగతం పలికి సత్కరించారు.

ఎమ్మెల్యే విజేత నెహ్రూను కలిసిన సువర్ణకుమార్



ఎమ్మెల్యే నెహ్రూను కలిసిన సువర్ణకుమార్

గోకవరం, జూన్ 18: జగ్గంపేట కూటమి ఎమ్మెల్యే విజేత జ్యోతుల నెహ్రూను స్థానిక హన్నా విద్యా సంస్థల అధినేత బి.సువర్ణకుమార్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో డీఎడ్ కాలేజీలను మూసి వేశారని, ఫలితంగా ఎందరో అధ్యాపకులు రోడ్డున పడ్డారని సువర్ణకు మార్ ఈసందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసికెళ్లారు. మూతబడిన కాలేజీలను తిరిగి పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సువర్ణకుమార్ ఎమ్మెల్యే నెహ్రూకు విజ్ఞప్తి చేశారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: హరోంహర
సూర్యామినీ	: చందు చాంపియన్
సూర్యాప్యాలస్	: హరోంహర
స్వామి	: మహరాజ
శివజ్యోతి	: యేవమ్, సత్యభామ
అనుశ్రీ(సాయికృష్ణ)	: మనమే
రాజా	: బ్యాడ్ బాయ్స్
ఊర్వశి	: రాజధాని రౌడీ
రంభ	: ఇంద్రాణి
మేనక	: సత్యభామ
అప్సర	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి	: మ్యూజిక్ షాప్ మూర్తి
వీఎస్ మహాల్(నామవరం)	: హరోంహర
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: మ్యూజిక్ షాప్ మూర్తి
వెంకటసూర్య(కడియం)	: హరోంహర
సత్యగౌరి (అనపర్తి)	: హరోంహర
సూర్యశ్రీ (అనపర్తి)	: ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మహరాజ
గీతాసినిమాస్ (సీతానగరం)	: హరోంహర
శ్రీనివాస (గోకవరం)	: హరోంహర
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: మహారాజ
లలితామహల్(రంపచోడవరం)	: హరోంహర
నవయుగ(చింతూరు)	: ఆ ఒక్కటీ అడక్కు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 19 జూన్ 2024 | 5


ఈ చిత్రంలో కనిపిస్తున్నది కొవ్వూరు బస్టాండ్.. డివిజన్ కేంద్రంలో ఉన్నా రాత్రయితే అంధకారమే ఎందుకో మరి..

8


కలవచర్ల కేవీకేలో పీఎం కిసాన్ నిధుల విడుదలను వీక్షిస్తున్న రైతులు

రైతుల ఖాతాల్లో 19.72 కోట్లు జమ

రాజానగరం, జూన్ 18 : పీఎం కిసాన్ పథకం 17వ విడతలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో 18 మండలాలకు చెందిన 98,612 మంది రైతులకు రూ.19.72 కోట్ల 24 వేలు జమ చేసినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. రాజానగరం మండలం కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రంలోని ప్యాక్స్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు రైతులతో కలిసి వీక్షించారు. కలెక్టర్ వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణసిలో మంగళవారం కిసాన్ సమ్మేళన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా రైతులకు పీఎం కిసాన్ పథకం 17వ విడత నిధులు జమ చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 107 ప్యాక్స్‌లలో ప్రత్యేక కార్యక్రమాలను మండలాల వారీగా ఏర్పాటు చేసినట్టు మాధవరావు తెలిపారు. అనపర్తి మండలంలో 4,183 మంది రైతులకు రూ.83,66 లక్షలు, బిక్కవోలు మండలంలో 5,572 మంది రైతులకు రూ.1.11 కోట్లు, రంగంపేట 6,370 మందికి రూ.1.27 కోట్లు, రాజమహేంద్రవరం రూరల్ 1,896 మందికి రూ.37.92 లక్షలు, కడియం 5,234 మందికి రూ.1.04 కోట్లు, రాజానగరం 8,472 మందికి రూ.1.69 కోట్లు, కోరుకొండ 6,300 మందికి రూ.1.26 కోట్లు, సీతానగరం 5,049 మందికి రూ.1.98 కోట్లు, గోకవరం 7,011 మందికి రూ.1.40 కోట్లు, దేవరపల్లి 6,250 మందికి రూ.1.25 కోట్లు, గోపాలపురం 5,273 మందికి రూ.1.05 కోట్లు, నల్లజర్ల 6,761 మందికి రూ.1.35 కోట్లు, కొవ్వూరు 5,297 మందికి రూ.1.06 కోట్లు, చాగల్లు 5,163 మందికి రూ.1.03 కోట్లు, తాళ్లపూడి 4,116 మందికి 82.32 లక్షలు, ఉండ్రాజవరం 5,077 మందికి రూ.1.1 కోట్లు, నిడదవోలు 5,241 మందికి రూ.1.05 కోట్లు, పెరవలి 5,347 మందికి రూ.1.7 కోట్ల నగదును సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ నాయుడు, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో శాంత,మోది సత్తిబాబు, రైతులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లపై దృష్టి పెట్టండి : కలెక్టర్



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 18: జిల్లాలో అన్న క్యాంటీన్లు పునఃవ్యవస్థీకరణకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని మునిసిపల్ కమిషనర్లకు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేర కు రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం అధికారులతో సమీక్షించారు. రాజమహేంద్రవరంలో 3, నిడదవోలు, కొవ్వూరులలో ఒక్కొక్కటి చొప్పున అన్న క్యాంటీన్లు గతంలో నిర్వహించినట్టు తెలిపారు. ఆయా కాంటీన్లు ప్రారంభించడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కాన్ఫరెన్స్‌లో కమిషనర్లు దినేష్ కుమార్, డానియేల్ జోసఫ్,టి.రామ్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాటా..కోటా!

రేషన్ కాటాలోనూ బొక్కుడే..



- పేదల రేషన్‌లోనూ కక్కుర్తి
- తూకంలో పెద్ద ఎత్తున తేడా
- మంత్రి ఆదేశాలతో తనిఖీలు
- జిల్లాలో కేజీకి 100 గ్రాములు..
- అరకేజీకి 50 గ్రాములు నొక్కుడు
- ప్రభుత్వానికి అధికారుల నివేదిక
- ఐదేళ్లలో ఏడుగురు డీఎంల మార్పు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అన్ని వ్యవస్థలు గాలిలో ఉన్నాయి.. వైసీపీ విధ్వంసానికి బలైపోయాయి.. మళ్లీ గాడిలో పెడదామని రంగంలోకి దిగిన మంత్రులు తలలు పట్టుకుంటున్నారు.. వైసీపీ ప్రభుత్వం సివిల్ సప్లయిస్ వ్యవస్థను వదల్లేదు. అక్కడా విధ్వంసం సృష్టించింది. పేద ప్రజలకు రేషన్ కార్డుల ద్వారా ఇచ్చే కోటా సరుకుల్లోనూ కోత విధించి అక్రమాలకు తెరలేపింది. ఇటీవల కూటమి సివిల్ సప్లయిస్ మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్‌లో పంపిణీ చేసే కందిపప్పులో అవకతవకలను గుర్తించి అవాక్కయ్యారు. గతేడాది అక్టోబరు నుంచే కందిపప్పు ఇవ్వడం మానేశారు.పంచదార కొంతమందికే ఇస్తున్నారు. ఆయిల్ రేషన్‌లో నిల్.. ఇదిలా ఉండగా జిల్లాలో సివిల్ సప్లయిస్ డీఎంను ఏడు సార్లు మార్చారు. 8వ డీఎం ప్రస్తుతం పనిచేస్తున్నారు.ధాన్యం కొనుగోలు, కస్టమ్ రైస్ మిల్లింగ్ వాటిలో జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఒత్తిడి పెరిగింది. వైసీపీ నేతల ఒత్తిడితో వారికి కావలసిన మిల్లర్లకే ధాన్యం కొనుగోలు అవకాశాలు కల్పించారు. కాదు కూడదంటే అధికారులను మార్చేస్తున్నారు. ఈ విధంగా జిల్లాలో ఇప్పటి వరకూ ఏడుగురు మారారు.

జిల్లాలో 5.73 లక్షల కార్డులు..

సివిల్స్ సప్లయిస్ సంస్థ ఆధ్వర్యంలో బియ్యం కస్టమ్ మిల్లింగ్, రేషన్ దుకాణాలకు బియ్యం, కందిపప్పు,పంచదార సరఫరా వంటివి ఉంటాయి. జిల్లాలోని అంగన్‌వాడీలకు ఇక్కడ నుంచి బియ్యం, కందిపప్పు, ఆయిల్ వంటివి సరఫరా చేస్తారు. డీఎం నుంచి డీఎస్‌వోకు సరుకు వెళ్లిన తర్వాత రేషన్ దుకాణాలు, సంబంధిత సంస్థలకు సరఫరా చేస్తారు. జిల్లాలో 5 లక్షల 73 వేల రేషన్ కార్డులు ఉన్నాయి. 870 రేషన్ షాపులు, 364 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. నెలకు జిల్లాలో 8,500 టన్నుల బియ్యం, 235 టన్నుల పంచదార, అదే స్థాయిలో కందిపప్పు పంపిణీ చేయాలి. కానీ గత అక్టోబరు నెల నుంచి కందిపప్పు రావడంలేదు. కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నట్టు చెబుతూ బయట మార్కెట్ రేటు ఎక్కువగా ఉండడం వల్ల సొమ్ములు చేసుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. అంగన్‌వాడీల పరిస్థితీ అంతే. పైగా పంచదార,కందిపప్పు సరఫరా చేసే కాంట్రాక్టర్లు తూకాల్లో మోసం చేస్తున్నారు. లెక్క ప్రకారం కార్డులోని ఒక్కో మనిషికి 5 కేజీల బియ్యం పంపిణీ చేస్తారు. కార్డుదారులకు రూ.67లకే కేజీ కందిపప్పు, రూ.17లకే అరకేజీ పంచదార ఇవ్వాలి. ఇక ఏఏవై కార్డుదారులకు పంచదార కేజీ రూ.13లకే ఇవ్వాలి. కానీ అనేక అవకతవకలు జరిగాయి. కేంద్రం నుంచి వచ్చిన ఉచితం బియ్యం పంపిణీ కూడా సక్రమంగా జరగలేదంటే పరిస్థితి ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

గడపగడపకూ లేదు..

డీఎస్‌వో ద్వారా రేషన్ షాపులకు గతంలో బియ్యం, పంచదార, కందికప్పు,పామాయిల్ వంటివాటితో పాటు సంక్రాంతి, క్రిస్మస్ వంటి కానుకలు కూడా పంపిణీ చేశారు. వైసీపీ హయాంలో ఈ వ్యవస్థ ధ్వంసమైంది. ఏ నెలలో ఏ సరుకు ఇస్తారో కూడా తెలియదు. రేషన్ షాపులను పక్కన పెట్టి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తామని చెప్పినా అది పూర్తిగా సక్సెస్ కాలేదు. ఎండీయూ వాహనదారులకు సరుకు పెట్టుకునే అవకాశాలు లేకపోవడంతో రేషన్‌షాపు డీలర్ల వద్దే ఉంచి అక్కడ నుంచి వాహనంలో తీసుకు వెళతున్నారు. రేషన్ వాహనం ఇంటింటికీ పంపిణీ చేయాలనేది ఆలోచన అయితే వీధివీధికీ అన్నట్టు తయారైంది.

ఇక కందిపప్పు ,పంచదార

వచ్చే నెల నుంచి అన్ని రేషన్ కార్డులకు బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార పంపిణీ చేసే ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తుంది. ఇంకా వీటిపై స్పష్టమైన ఆదేశాలు రాలేదు. ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తారా? లేదా రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తారా! మరింత మెరుగైన విధానం అమలు చేస్తారా అనేది తేలాలి.

జిల్లాలో బయటపడ్డ మోసాలు

రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ లో లోపాలను పట్టుకోవడంతో పాటు వాటిని సరిదిద్దడా నికి ఉపక్రమించింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేసి నప్పుడు తూకంలో మోసం బయటపడిన సంగతి తెలి సిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్ని జిల్లాలకు ఆదేశాలు పంపింపిది. అన్ని మండల లెవల్ స్టాయి పాయింట్లలో తనిఖీ చేసి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. తూనికలు కొలతలు, సివిల్ సప్లయిస్ డీటీ, ఓ జిల్లా స్థాయి అధికారితో ఒక కమిటీ చొప్పున మూడు కమిటీలు వేసి తనిఖీలు చేయించారు. అన్ని ఎంఎల్ఎస్ పాయింట్లలోనూ తనిఖీలు చేయగా, ప్రతి సరుకులోనూ తూకం తక్కువ ఉండడం గమనించారు. కేజీకి 100 గ్రాములు, అరకేజీకి 50 గ్రాములు తక్కువ ఉంది.ఈ నివేదికను ప్రభుత్వానికి పంపడంతో తక్కువ తూకం ఉన్న సరుకును పంపిణీ చేయకుండా నిలిపివేయవలసిందిగా ఆదేశించారు. ప్రభుత్వం వీటిని సరిచేసి పంపడమో.. కొత్తగా పంపడమో చేస్తుంది.


సచివాలయానికి వెళ్లిన ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు .. చిత్రంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఉన్నారు. - నిడదవోలు

సీనియర్ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

50 శాతం దాటని ఉత్తీర్ణత

జిల్లాలో పాస్ 49.40 శాతమే

రాజమహేంద్రవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ(ఐపీఏఎస్ఈ మే 2024)లో రెండో ఏడాది పరీక్షా ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. వీటిలో జిల్లాలో 49.40 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు 755 మంది పరీక్షలు రాయగా 382 మంది, ఎయిడెడ్ 56 మంది పరీక్షలు రాయగా 24 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ 76 మంది పరీక్షలు రాయగా 44 మంది, కోఆపరేటివ్ 73 మంది పరీక్షలు రాయగా 27 మంది, హైస్కూల్ ప్లస్ 121 మంది పరీక్షలు రాయగా 69 మంది, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ 2136 మంది పరీక్షలు రాయగా 1057 మంది, ప్రైవేట్ కాంపోజిట్ 144 మంది పరీక్షలు రాయగా 59 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం జిల్లాలో 3,361 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1,662 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో 422 మంది విద్యార్థులకు 216 (51శాతం) మంది పాసయ్యారు. ఫలితాలు https://resultsbie.ap.gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి ఆయా కళాశాలల్లో విద్యార్థులు ఒరిజినల్ మార్కుల మెమోలను పొందవచ్చని అధికారులు తెలిపారు. రీవెరిఫికేషన్‌కి ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకూ సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి ఏడాది సప్లిమెంటరీ ఫలితాలను ఈ నెల 26న విడుదల చేస్తామన్నారు.

వెనుకే వచ్చాడు.. డబ్బు లాక్కుపోయాడు

సంచిలో రూ.లక్ష ఉందని ఫిర్యాదు

కొవ్వూరు, జూన్ 18 : నడిచి వెళుతున్న వ్యక్తి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రూ.లక్ష నగదు సంచి లాక్కొని పారిపోయినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. కొవ్వూరు మెయిన్‌రోడ్‌లో శ్రీ లక్ష్మీ శ్రీనివాసా రైస్ అండ్ కిరాణా వ్యాపారం చేస్తున్న జక్కా శ్రీనివాస్ ఈ నెల 17వ తేదీన రాత్రి 9:30 గంటల సమయంలో షాపు కట్టిన తరువాత ఇంటికి నడిచివెళుతున్నాడు. పుంతలో మునలమ్మ గుడి వీధిలో వెనుక వైపు నుంచి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి తన ఎడమ చేతిలో ఉన్న రూ. లక్ష డబ్బు సంచి లాక్కొని పారిపోయినట్టు బాధితుడు తెలిపారు. తాను వెనుక వెంబడిస్తూ పరిగెత్తి కింద పడిపోగా కుడి భుజం గూడుకు దెబ్బ తగిలిందన్నారు. పెద్దగా కేకలు వేయడంతో చుట్టుప్రక్కల వాళ్లు వచ్చి కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా రాజమహేంద్రవరం రిఫర్ చేశారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసును మోదు చేసినట్టు హెచ్‌సి బాబూరావు తెలిపారు.

వరీ్రంయే!



- అందని వరి విత్తనాలు
- లబోదిబోమంటున్న రైతులు
- 10 శాతం విత్తనాల సరఫరా లేదు
- అన్నదాతల ఎదురుచూపులు
- కోరుకొండ డివిజన్‌లో ఇదీ పరిస్థితి

కోరుకొండ, జూన్ 18 : ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులు అవుతుంది.. అయినా ఇంత వరకు కోరుకొండ సబ్‌డివిజన్‌వ్యవసాయశాఖ పరిధిలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు సంబంధించి రైతుల అవసరాలకు కనీసం 10 శాతం వరి విత్తనాలను వ్యవసాయశాఖ సిద్ధం చేయలేదు. కోరుకొండ మండలంలో 5912 హెక్టార్లు, గోకవరం మండలంలో 5124 హెక్టార్లు, సీతానగరం మండలం 5665 హెక్టార్లలోను వరిసాగు చేస్తున్నారు.మొత్తంగా 16,701 హెక్టార్లు అనగా సుమారు 42 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ఈ మేరకు రైతులకు 835 టన్నుల వరి విత్తనాలు అవసరం. దీనిలో మండల వ్యవసాయ శాఖ కనీసం 10 శాతం విత్తనాలు కూడా సిద్ధం చేయలేదు. రైతు భరోసా కేంద్రాల్లో కూడా రైతులకు అవసరమైన వరి విత్తనాలు లేవు.ఖరీఫ్ సీజన్ నెల రోజులకు ముందే రైతులకు అవసరమైన విత్తనాలను సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే నేటికీ విత్తనాలు అందక పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు అవసరమైన నాణ్యమైన వరి విత్తనాలను అందజేసేవారు. ఈ సంవత్సరం ఎందుకో మరి కోరుకొండ, శ్రీరంగపట్నం, బూరుగుపూడి, గాడాల, దోసకాయలపల్లి సొసైటీల్లో వరి విత్తనాలకు ఆర్డర్లు పెట్టలేదు. అటు వ్యవసాయ శాఖ ద్వారా కానీ, ఇటు రైతు సొసైటీల ద్వారా కానీ రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ టీచర్లు అధిక ధరలకు వరి విత్తనాలు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖ సబ్ డివిజన్‌లో మొత్తం 64 రైతు భరోసా కేంద్రాలకు వరి విత్తనాలు సిద్ధం చేయలేదు.తక్షణం తమకు అవసరమైన నాణ్యమైన వరి విత్తనాలు వ్యవసాయ శాఖ ద్వారా కానీ, రైతు పరపతి సంఘాల ద్వారా కానీ అందజేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లికార్జునరావును వివరణ కోరగా 110 టన్నుల వరి విత్తనాలకు ఇండెంట్ పెట్టినా ఇంకా రాలేదు.. వస్తాయో రావో తెలియదన్నారు.


కొవ్వూరులో టిడ్కో గృహాల వద్ద అధికారులతో మాట్లాడుతున్న ముప్పిడి

4 నెలల్లో టిడ్కో ఇళ్లు

- గత టీడీపీ హయాంలోనే 80 శాతం పనులు
- ఐదేళ్లలో జగన్ 20 శాతం పూర్తిచేయలేదు
- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ధ్వజం

కొవ్వూరు, జూన్ 18 : పట్టణ ప్రాంతాల్లో పేదలందరికి కూటమి ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు అందిస్తామని కొవ్వూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే విజేత ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని టిడ్కో గృహాలను కూటమి నాయకులతో కలిసి మంగళవారం సందర్శించారు. 2014-19లో పట్టణ ప్రాంతాల్లో ఉన్న పేదలందరికి సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టారన్నారు.కొవ్వూరులో 240 సింగిల్ బెడ్ రూమ్‌లు, 240 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేసి వారి నుంచి షేరు ధనం కట్టించి గృహాల నిర్మాణం చేపట్టి 80 శాతం నిర్మాణ పనులు పూర్తిచేశారన్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కేవలం 20 శాతం పనులు పూర్తి చేసి ఇవ్వలేకపోయిందన్నారు. టిడ్కో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతుంటే జగన్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందాడన్నారు. రాజధాని అమరావతిని మూడు రాజధానుల పేరుతో నిర్వీర్యం చేశారన్నారు. పోలవరం ప్రాజెక్టును 72 శాతం చంద్రబాబు హయాంలో పూర్తిచేస్తే మిగిలింది చేయ లేకపోయాడన్నారు. ఐదేళ్లలో జగన్ విధ్వంసం తప్ప ఏమీ చేయలేదన్నారు. టిడ్కో గృహాల సముదాయంలో మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. తాగునీరు, విద్యుత్, సీసీ రోడ్లు, మెయిన్‌రోడ్ నుంచి టిడ్కో గృహాల వరకు టీబీ రోడ్డు నిర్మాణాలు వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గత ఐదేళ్లుగా ఏమి పట్టించుకోకుండా వదిలేసిన పనులను 3 నుంచి 4 నెలల్లో పూర్తి చేసి అందజేస్తామన్నారు. జగనన్నకాలనీలో సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. ఇంకనూ సొంతిళ్లు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం అందజేస్తామన్నారు. ఇళ్లు లేని ప్రతి ఒక్కరికి ఇళ్లు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమని రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, బి.వి. ముత్యాలరావు, నాదెళ్ల శ్రీరామ్, తహశీల్దార్ కె.మస్తాన్, మునిసిపల్ మేనేజర్ రాధాకృష్ణ, టిడ్కో గృహాల ఏఈ పి.సూర్యకుమారి, పెనుమాక జయరాజు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న.. ఇళ్లే టార్గెట్

- జిల్లాలో రెచ్చిపోయిన దొంగలు.. వరుస చోరీలు
- రాజానగరంలో రెండు చోట్ల.. పాలంగిలో దోపిడీ
- 78 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ

రాజానగరం, జూన్ 18 : దొంగలు రెచ్చిపోతున్నారు.. తాళం వేసి ఉన్న ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. జిల్లాలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రాజానగరంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి తాళం వేసి ఉన్న ఇళ్లలో విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటుగా, నగదును దొంగలు దోచుకున్నారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. స్థానిక వైఎస్సార్ కూడలి సమీపంలో కీర్తన ఇటీవల ఇంటికి తాళాలు వేసి ఊరెళ్లారు. ఇది గమనించిన దొంగలు రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో భద్రపర్చిన 60 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.26 వేలు నగదు అపహరించారు. మరో ఇంట్లో ప్రవేశించినప్పటికి ప్రయోజనం లేక వెళ్లినట్టు బాధితులు తెలిపారు. మునసావారి వీధిలో రఘువంశరెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లడంతో తాళాలు బద్దలు కొట్టి ఇంట్లో బంగారు ఆభరణాలు దోచుకున్నారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో పక్కింటివాళ్లు మంగళవారం యజమానికి ఫోన్ చేసి సమాచారం అందించారు.యజమాని ఇంటి వచ్చి చూసే సరికి బీరువాలో భద్రపర్చిన 4 కాసుల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు నగదు,వెండి పూజా సామగ్రి అపహరణకు గురైనట్టు గుర్తించారు. బాధితులు మంగళవారం ఫిర్యాదు చేసినట్టు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

పాలంగిలో నగదు, బంగారం అపహరణ

ఉండ్రాజవరం, జూన్ 18 : మండలంలోని పాలంగి గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన చోరీలో బంగారం, నగదు చోరీకి గురయ్యాయి. పాలంగి ఎన్టీఆర్ విగ్రహం ఎదుట కొమ్మర విజయకుమార్ కుటుంబంతో నివాసం ఉంటున్నారు. వెల్డింగ్ పనుల నిమిత్తం విజయకుమార్ హైదరాబాద్ వెళ్లాడు. అతని భార్య ఆశానీలిమ ఇంటికి తాళం వేసి తన పిల్లలను తీసుకుని మండలంలోని చిలకపాడు పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గమనించిన దుండగులు సోమవారం రాత్రి ఇంటి తాళాలు, బీరువా పగులగొట్టి రూ.60 వేల నగదు, 14 గ్రాముల బంగారం, 20 తులాలు వెండిపట్టీలు దోచుకెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఉండ్రాజవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక దోపిడీ.. ఆపలేరా!?



- ఆగని ఇసుక దందా
- యథేచ్ఛగా తరలింపు
- పట్టించుకోని అధికారులు
- ఎమ్మెల్యే ఆదేశాలూ బేఖాతర్

ఉన్నతాధికారులే గోదావరిలో ఇసుక అక్రమ దోపిడీ సాగడం లేదని కితాబిస్తే.. ఇసుకాసురులు మాత్రం ఏం చేస్తారు..తమ పని తాము చేస్తారు.. ఎందుకంటే అక్రమ దోపిడీ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని.. ప్రస్తుతం అదే చేస్తున్నారు.. అడ్డూ అదుపూ లేకుండా ఇసుక దోపిడీకి తెగబడుతున్నారు.. ప్రభుత్వం మారినా ఇసుకాసు రుల తీరు మాత్రం మారలేదు.సాక్షాత్తు రాజమ హేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి హెచ్చరించినా అదే తీరు.. ఈ దోపిడీని కూటమి పాలకులు ఎలా అడ్డుకుంటారో చూడాల్సిందే..

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 18 : ఇసుకాసురుల ఇష్టారాజ్యమైపోయింది.. ప్రభుత్వం మారినా వారి తీరు మాత్రం మారడంలేదు. ఎవరేం చేస్తారులే అన్నట్టు దోపిడీకి తెగబడుతున్నారు.ఇటీవల కొవ్వూరు రెండు లారీలను పట్టుకున్న సంఘటన విదితమే.అధికారులు కేవలం డ్రైవర్లపై కేసులు నమోదు చేసి ఇసుక దోపిడీదారులను వదిలేశారు. దీంతో నూతన ప్రభుత్వ ఇసుక పాలసీ రాకుండానే అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలో ఇసుక ర్యాంప్‌ల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు.గత ప్రభుత్వంలో అలవాటైపోయిందో ఏమో కానీ అధికారులు చోద్యం చూస్తున్నారు.అయితే గతంలో వందల కొద్దీ లారీల ఇసుక తరలించగా నేడు మాత్రం ఒకట్రెండు లారీలు చాటుమాటుగా తిరుగుతున్నాయి.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్..

కూటమి ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ వచ్చే వరకు ఇసుక విక్రయాలు చేయరాదని ఇటీవల రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఇటీవల ఆదేశాల జారీ చేశారు. ఆయన ఆదేశాలను బేఖాతరు చేసి మరి ఇసుక మాఫియా రెచ్చిపోతుంది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలోని కడియం మండలం బుర్రిలంక, రూరల్ మండలంలోని గాయత్రి తదితర ఇసుక ర్యాంపులు ఉన్నాయి. సుమారు 20 వరకూ అధికార, అనధికార ర్యాంపులు ఉంటాయి. గత ఐదేళ్లు ఆయా ర్యాంపుల్లో ఇసుకను రాత్రీ పగలూ లేకుండా తరలించేశారు. అనధికార డ్రెడ్జింగ్ చేశారు. ఎన్నికలకు ముందు అక్కడక్కడా ఇసుక కొండలను పెట్టారు. కడియం మండలం బుర్రిలంక, రాజమహేంద్రవరం ఎస్పీ కార్యాలయం పక్కన తదితర ప్రాంతాల్లో ఇసుక కొండలు వెలిశాయి. ఆయా ప్రాంతాల నుంచి ఇప్పుడు రాత్రి సమయంలో అక్రమ వ్యాపారం చేస్తున్నాయి.

రాత్రి దోపిడీ.. పగలు అమ్మకం..

కూటమి ప్రభుత్వం ఇంకా ఇసుక పాలసీని ప్రకటించలేదు. ప్రభుత్వం ప్రకటించాక అప్పుడు ఆ విధానం ప్రకారం ఇసుక సరఫరా చేయాలి. కాని రూరల్‌లో ఇసుకాసురులు దోపిడీకి అడ్డూ అదుపూలేదు. కొంత మంది చోటామోటా నాయకులు అప్పుడే ఇసుకలో చక్రతిప్పుతున్నట్టు తెలిసింది. సాక్షాత్తు ఎమ్మెల్యే గోరంట్ల ఇసుక సరఫరా నిలిపివేయాలని ప్రకటించినప్పటికి ఈ దందా ఆగకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఎమ్మెల్యే దృష్టికి వెళ్లకుండానే కొంత మంది అధికారులు ఈ తతంగం నడుపుతున్నట్టు విమర్శలు ఉన్నాయి. కడియం మండలంలోని బుర్రిలంక, వేమగిరి, ధవళేశ్వరంలోని గాయత్రి, కోటిలింగాలు రేవులు, కాతేరు పది రేవులు, వెంకటనగరం రేవులు ఇలా అన్ని రేవులు ఇసుకను బయటకు డంప్ చేసి అక్కడ నుంచి అక్రమంగా తరలించి దానిని తిరిగి అక్రమ రవాణా చేస్తున్నారు. దోపిడీ పెద్ద ఎత్తున జరుగుతున్నా అడ్డుకునే వారే లేకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వం మారిన ఇసుక అక్రమ వ్యవహారాల్లో మార్పురాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా న్యాయవాదులకు మధ్యవర్తిత్వ శిక్షణ

8



సదస్సులో మాట్లాడుతున్న ఈడీజే గంధం సునీత

రాజీ మార్గంతో సమయం ఆదా

● పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, రాజీ మార్గంతో సమయం ఆదా అవుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. న్యాయవాదులకు నిర్వహించే మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. మధ్యవర్తిత్వం ద్వారా త్వరితగతిన ప్రయోజనం సమాకూ రుతుందన్నారు. ఖర్చు లేకుండా సామరస్యపూర్వకంగా కేసులను పరిష్క రించుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఐదు రోజుల్లో 40 గంటల పాటు తూర్పుగోదావరిజిల్లాకు చెందిన న్యాయవాదులకు బెంగ ళూరుకు చెందిన పొటెన్షియల్ ట్రైనర్స్ గీతాదేవి, బి.శ్రీకుమార్, చెన్నైకి చెందిన సీనియర్ ట్రైనర్ ఆర్.విజయకమల మధ్యవర్తిత్వ నైపుణ్య శిక్షణ అంది స్తారన్నారు. ఈనెల 26వ తేదీ వరకూ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.గాయత్రి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు పాల్గొన్నారు.

ఖైదీలకు మొక్కల పెంపకంలో శిక్షణ

రాజమహేంద్రవరం, జూన్ 18 (ఆంధ్ర జ్యోతి): ఖైదీలకు మొక్కల పెంపకంలో ఈనెల 18 నుంచి 30 వరకూ శిక్షణ ఇస్తున్నామని సూపరిం టెండెంట్ రాహుల్ తెలిపారు. వివిధ రకాల పండ్లు, పూలు, క్రోటాన్స్ మొక్కల పెం పకంలోని మెలకువలను నేర్పిస్తున్నామ న్నారు. మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యానవన విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ కె.స్వాతి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. మొక్కల అభివృద్ధి చేయడం తద్వారా ద్వారా ఉపాధి పొందడాన్ని వివరించారు. మొక్కల పెంపకంలో కృషి ఎంత ఉంటే అంతగా సంపాదన ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూప రిండెంటెండ్ రాజ్‌కుమార్, మునిసిపల్ ఉద్యానవన ఉద్యోగి బాలు, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వాన్ని ఉపేక్షించను



ఎంపీడీవో రమేష్

గోపాలపురం, జూన్ 18: విధి నిర్వహణలో అలస త్వాన్ని ఉపేక్షించేది లేదని ఎంపీడీవో కే.రమేష్ సచివాల య సిబ్బంది హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గోపాలపురంలోని మూడు సచివాల యాల్లో పనిచేస్తున్న సచివాలయ సిబ్బందిని ఆయన రాతపూర్వకంగా ఉన్న వివరణ పత్రాన్ని ఆయన అందు కున్నారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 12న ముఖ్య మంత్రి ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రజ లను తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బస్సులను ఏర్పాటు చేసిందన్నారు. ఆ బస్సుల దగ్గర ఉండి ప్రజలను బస్సులు ఎక్కించేందుకు సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శికి బాధ్యతలు అప్పగించామన్నారు. మండలస్థాయి అధికారులు సైతం పంచాయతీ కార్యదర్శులను సమన్వ యం చేసుకుని ప్రజల ను బస్సులు ఎక్కించే పనిలో నిమగ్నమై ఉన్నప్పటికీ గోపాలపురం పరిధిలో ఉన్న 1, 2, 3 సచివాలయ సిబ్బంది మాత్రం విధులు హాజరుకాలేదన్నారు. గత మూడురోజుల కిందట ఈ 3 సచివాలయ పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. దీనిపై వివరణతో కూడిన రాతపత్రాలను ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామన్నారు. మంగళ వారం వారివద్ద నుంచి వివరణతో కూడిన రాతపత్రాలను తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో బా ధ్యత రహితంగా మరోసారి ప్రవర్తించినట్లు పునరావృతం అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

పోతవరం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

నల్లజర్ల, జూన్ 18: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పీహెచ్‌సీ సిబ్బంది అధిగమిస్తున్నారా లేదా అనే అంశంపై మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. వార్షిక బడ్జెట్, ఖర్చులు, రికార్డులు పరి శీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వైద్య సిబ్బంది ఉండి సేవలు అందించాలన్నారు. వైద్య సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి ప్రజల మన్నలను పొందా లన్నారు. డాక్టర్ రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తల కృషి మరువలేనిది

● టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ

గోపాలపురం, జూన్ 18: గత ఐదు సంవత్సరాలుగా టీడీపీ తిరిగి అధికారం లోకి తీసుకురావాలని కార్యకర్తలు చేసిన కృషి మరువలేనిదని టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ అన్నారు. మంగళవారం నియోజకవర్గ ముఖ్యకేంద్రమైన గోపాలపురంలో టీడీపీ మండల సమావేశంలో ఆయన మా ట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకుని పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం రేయింబవళ్ళు కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా నిలబడుతుందన్నారు. అదేవిధంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రతీ కార్యకర్తను ఆదుకుని వారి భవిష్యత్తుకు భద్రత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షు డు నూతంగి దొరబాబు, కార్యదర్శి వడ్లమూడి రమేష్, కోర్లపాటి రాము, గద్దే హరిబాబు, జ్యేష్ఠ శ్రీనివాసరావు, కార్యకర్తలు, నాయకులు, గ్రామకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

'బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలి'



చిట్యాలలో బడికిపోదాం ర్యాలీలో పాల్గొన్న ఎక్స్ ఆఫీషియో మెంబర్ నూతంగి దొరబాబు

గోపాలపురం, జూన్ 18: బడిఈడు పిల్లల్ని బడిలో చేర్పించి వారి భావితరాల భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర సంస్కృతిక విభాగ అధికార ప్రతినిధి, హైస్కూల్ ఎక్స్ ఆఫీషియోస్ మెంబర్ నూతంగి దొరబాబు అన్నారు. మండ లంలోని చిట్యాల గ్రామంలో బడికి పోదాం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహి ంచారు. విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉ పాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

● 48 విస్కీ క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం

కొవ్వూరు, జూన్ 18 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు న మోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొవ్వూరు మండలం వేములూరు గ్రామంలో అక్ర మంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో మంగళవారం సీఐ సిబ్బందితో దాడి చేశారు. మిద్దే బాబ్జీ అనే వ్యక్తిని అరెస్టుచేసి అతని వద్ద నుంచి 48 విస్కీ క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి నట్లు సీఐ తెలిపారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కడియం, జూన్ 18: కడియం మండల పరిషత్ కార్యాలయంలో నేడు ఉద యం 10 గంటలకు ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమా వేశం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, మండల ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, జనసేన, బీజేపీ నాయకులు హాజరుకావాలన్నారు.

చిలకపాడులో అఖండ అన్నసమారాధన

ఉండ్రాజవరం, జూన్ 18: మండలంలోని చిలకపాడు గ్రామంలో ఐశ్వర్య సుందరేశ్వస్వామివారి ఆలయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విచ్చేశారు. అనంతరం అఖండ అన్నస మారాధన నిర్వహించారు.

పీఎం కిసాన్ నిధులు విడుదల

● కొవ్వూరు నియోజకవర్గంలో రూ. 4.25 కోట్లు జమ



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూన్ 18 : పీఎం కిసాన్ పథకంలో రైతులకు పెట్టుబడి సాయం కింద మొదటి విడతగా 21,273 మంది రైతులకు ఒక్కొక్కరికీ రూ. 2వేల చొప్పన రూ. 4,25,46,000లు రైతుల ఖాతాలలో జమచేయడం జరుగుతుందని కూటమి ఎమ్మెల్యే విజేత ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహిం చారు. ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి వికసితభారత్ పీఎం కిసాన్ పథకంలో రైతులకు సంవత్సరానికి రూ. 6వేలు ఆర్థిక సాయం మూడు విడతలుగా అందజేస్తారన్నారు. మంగళవారం మొదట విడతగా కొవ్వూరు మండలంలో 7845 మంది రైతులకు గాను ఒక్కొక్కరికీ రూ.2వేలు చొప్పన 1,56,90,000లు, చాగల్లు మండలంలో 7313 మంది రైతులకు 1,46,26,000లు, తాళ్లపూడి మండలంలో 6115మంది రైతులకు 1,22,30,000లు, నియోజకవర్గం మొత్తం 21,273 మంది రైతులకు రూ. 4,25,46,000లు రైతుల ఖాతాలలో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జమ చేసినట్లు తెలిపారు. రెండవ విడతగా అక్టోబరు నెలలో, మూడవ విడతగా జనవరి నెల లో జమచేస్తామన్నారు. గతంలో జగన్మోహనరెడ్డి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పథకాలను తమ పథకాలుగా ఫోటోలు వేసుకుని ప్రచారం చేసేవారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల నేతృత్వంలో ప్రజలకు సంక్షేమంతోపాటు అభివృద్ధిని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తామన్నారు. రైతులు, మహిళలు, యువత, బడుగు, బల హీనవర్గాలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపడతామన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం కూటమి ముఖ్య మంత్రి చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు పోలవరం ప్రాజెక్టును సంద ర్శిస్తారని తెలిపారు. గత 5 సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం అధికారులు, ఏజెన్సీలను మారి, విత్తనాలు, డ్రిప్, ట్రాక్టర్లు, పనిముట్ల సబ్సిడీపై రైతులకు అందించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఈనెల 24 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలలో శాఖల వారీగా బడ్జెట్ కేటాయించి రైతులు, ప్రజల పక్షాన పాలన అందిస్తారన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠ మణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, పిల్లలమర్రి మురళీకృష్ణ, బి.వి. ముత్యాలరావు, బర్ల శ్రీనివాస్, కౌన్సిలర్లు పాలూరి నీలిమ, కిలాని వెంకటలక్ష్మి, బొండాడ సత్యనారా యణ, డేగల రాము, గంగుమళ్ళ స్వామి, వ్యవసాయాధికారులు పి. చంద్రశే ఖర్, ఏవో ఎ.గంగధర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ డబ్బులు విడుదల కార్యక్రమాన్ని వీక్షిస్తున్న రైతులు

పెరవలి : పీఎం కిసాన్ పథకం కింద 17వ విడత నిధులను దేశ ప్రధాన మంత్రి మోదీ విడుదల చేసిన పెరవలి మండలం కానూరు అగ్రహా రం గ్రామ సచివాలయంవద్ద టెలివిజన్ ద్వారా ప్రత్యక్ష ప్రచారం అధికారులు ఏర్పాటు చేశారు. రైతులతో పాటు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఉత్తరప్రదేశ్‌లో వారణాసి వేదికగా ఆయన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షే మ శాఖా మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్తో కలిసి నిధులు విడుదల చేశారు.



రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి, తదితరులు



ఎంపీ పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న తాళ్లపూడి టీడీపీ మండల నాయకులు

ఎంపీ పురందేశ్వరికి అభిమాన వెల్లువ

గోపాలపురం/దేవరపల్లి,జూన్ 18: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని ఆమె స్వగృహంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రా జు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ రాజమండ్రి పార్లమెంట్ అత్యధిక మెజారిటీతో గెలిచిన ఎంపీ పురందేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నియోజక వర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఆమెను కోరామన్నారు. నియోజకవర్గ సమస్యలు విన్న ఆమె సానుకూలంగా స్పందిం చారని అన్నారు. ద్వారకాతిరుమల, దేవరపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, అనిల్, దేవరపల్లి మాజీ జడ్పీటీసీ వీరాస్వామి చౌదరి, టీడీపీ నాయకులు శ్రీను, గొల్లపూడి దొరాజీచౌదరి, జమ్ముల సతీష్, ధర్మరాజు, పసుమర్తి రతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన మండల టీడీపీ నాయకులు

తాళ్లపూడి: తాళ్లపూడి మండల టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకు లు ఎంపీ పురందేశ్వరిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, తెలుగు రైతు అధ్యక్షుడు కొఠారు వెంకట్రావు, బీజేపీ మండ లాధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ, దూళ్ల నాగు, గెలి మణికంఠ, పేరూరి తాతారావు, కిల్లాని మహేష్ పాల్గొన్నారు.



పురందేశ్వరిని రాజమహేంద్రవరంలో మర్యాదపూర్వకంగా కలిసిన చాగల్లు బీజేపీ నాయకులు

పురందేశ్వరిని కలిసిన బీజేపీ నాయకులు

చాగల్లు: ఎంపీ పురందేశ్వరిని చాగల్లు మండల బీజేపీ నాయకులు రాజమ హేంద్రవరంలోని ఆమె గృహంలో మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు తాళ్ళూరి వరప్రసాద్, మ ద్దుకూరి సురేష్, సహా పలువురు ఆమెను కలిసిన వారిలో ఉన్నారు. అనంత రం వారు చాగల్లులో మాట్లాడుతూ నియోజవర్గం పరిధిలో ప్రజలకు అందు బాటులో ఉంటూ తన పరిధిలోని సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఉద్యాన పంటలతో ఆదాయం

● కలెక్టర్ మాధవీలత



అయిల్ ఫాం నూతన వంగడాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

నల్లజర్ల, జూన్ 18 : ఉద్యాన పంటలవల్ల రైతులకు స్థిర ఆదాయం లభి స్తుందని కలెక్టర్ మాధవీలత అన్నారు. మంగళవారం దూబచర్లలో త్రీఎఫ్ అయిల్ ఫాం నర్సరీ, అక్షయ ఎరువుల కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీర్ఘాకాలిక పంటలు వేయడంవల్ల తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయంతోపాటు కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. ప్ర భుత్వ సబ్సిడీలు సైతం ఉద్యాన పంటలకే ఎక్కువగా ఉంటుందన్నారు. అనం తరం మలేషియా నుంచి దిగుమతి చేసిన హార్వెస్టింగ్ పోల్స్, దూబచర్ల రైతు చావా సుధాకర్ తయారుచేసిన హార్వెస్టింగ్ గ్రాబ్బర్‌ను పరిశీలించారు. అయిల్ ఫాం నూతన వంగడాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సుజాతకుమారి, మండల ఉద్యాన అధికారి బబిత, ముసుళ్ళ కుంట సర్పంచ్ నందమూరి శారదాదేవి, త్రీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పిడికి గ్రంథాలయ సిబ్బంది అభినందనలు



ఎమ్మెల్యే ముప్పిడిని కలిసి అభినందనలు తెలుపుతున్న శాఖా గ్రంథాలయ సిబ్బంది

చాగల్లు, జూన్ 18: ఎమ్మెల్యే విజేత ముప్పిడి వెంకటేశ్వరరావును శాఖాగ్రం థాలయ సిబ్బంది మంగళవారం కొవ్వూరులో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు ఆధ్వర్యంలో కొవ్వూరు గ్రంథాలయ అధికారి జీఎస్‌వీ త్రినాథ్, చాగల్లు శాఖా గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు, తాళ్ళపూడి గ్రంథాలయ అధికారి నరేష్, చంద్రవం నుంచి కె.సుమాన్‌కుమార్ సహా నియోజకవర్గంలోని గ్రంథాలయ సిబ్బంది ఆయను కలిసిన వారిలో ఉన్నారు.

అంబేడ్కర్ మనుమడు యశ్వంత్‌రావును కలిసిన నాయకులు

కొవ్వూరు, జూన్ 18 : గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు బాబా సాహెబ్ అంబేడ్కర్ మనుమడు డా. యశ్వంత్‌రావు అంబేడ్కర్‌కు మర్యాద పూర్వకంగా కలిసినట్లు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతా శ్యాం రవిప్రకాష్ తెలిపారు. విజయవాడలో రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన యశ్వంత్‌రావుకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. దేశ వ్యాప్తంగా దళిత, బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు, దొడ్డిగర్ల గంగధర్, చవ్వాకుల దర్మారావు, బాబూ రావు పాల్గొన్నారు.



యశ్వంత్‌రావు అంబేడ్కర్‌కు స్వాగతం పలుకుతున్న బొంతా శ్యాం రవిప్రకాష్

రైలింగ్ లేని కొవ్వాడ కాలువ కల్వర్టులు

తాళ్ళపూడి, జూన్ 18 : మండలంలో పలు గ్రామాల్లో కొవ్వాడ కాలువ నీరు పోవడానికి కల్వర్టులు కట్టారు. కానీ వాటికి రైలింగ్ ఏర్పాటు చెయ్యక పోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని పోచవరం తాడిపూడి గ్రామాలకు వెళ్లే దారిలో కల్వర్టు ఏర్పాటు చేశారు. కల్వర్టుకు రైలింగ్ ఏర్పాటు చేయకపోవడంతో పలు ప్రమాదాలు సంభవించాయని అక్కడి రైతులు తెలిపారు. పెద్దేవం నుంచి తిరుగుడుమెట్ట గ్రామానికి వెళ్లే దారిలో కొవ్వాడ కాలువనీరు పోవడానికి ఒక కల్వర్టు కట్టారు. అక్కడ రైలింగ్ ఏర్పాటుచేయడంలో అధికారులు విఫలమయ్యారని తిరుగుడుమెట్ట గ్రామస్థులు వాపోతున్నారు. రాబోయే వర్షాకాలాన్ని గుర్తుపెట్టుకుని వెంట నే కల్వర్టుకు రైలింగ్ ఏర్పాటుచేయాలని గ్రామస్తులు అధికారులను హెచ్చ రిస్తున్నారు.



రైలింగ్ లేని కొవ్వాడ కాలువ కల్వర్టు

అంధకారంలో కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్

● రాత్రి బస్టాండ్‌లోకి రావాలంటే భయపడుతున్న ప్రయాణికులు



బిల్డింగ్‌పై ఉన్న ట్యూబ్‌లైట్లు



అంధకారంగా ఉన్న కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్



కొవ్వూరు, జూన్ 18 : కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్‌కు రాత్రి సమయాల్లో ప్ర యాణికులు రావాలంటే భయాం దోళనకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో బస్టాండ్‌లో విద్యుత్ లైట్లు వేయకపోవడంతో చిమ్మచీకటిగా బస్టాండ్ అంతా అంధకారంలో మునిగిపోతుంది. బస్టాండ్ బిల్డింగ్‌పై ఉన్న ట్యూబ్‌లైట్లు వేస్తున్నారు తప్ప బస్టాండ్ లోపల ప్రయాణికులు వేచిఉండే హాలులో ఒక్క లైటు కూడా వేయడంలేదు. దీంతో బస్టాండ్ లోపలికి రావాలంటే ప్రయాణి కులు భయపడుతున్నారు. రాత్రి సమయాల్లో కొవ్వూరు వచ్చే బస్సులు సైతం బస్టాండ్ లోపలికి రాకుండా ప్రయాణికులను అన్నా క్యాంటిన్ వద్ద నిలుపుదల చేస్తున్నారు. లోపలికి వచ్చిన బస్సులు చీకటిలో ప్రయాణికులు కనిపించక వెనుది రుగుతున్నాయి. దీనికితోడు బస్టాండ్ గేటు బయట మద్యంషాపు ఉండ డంతో మందుబాబులు అక్కడే మద్యం సేవించడం, చీకటిలో బస్టాండ్ లోపలికి రావాలంటే భయ పడి ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను, ఆటోలను ఆశ్రయించి తమ గమ్యస్థానాలకు చేరుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఆర్టీసీలో విద్యుత్ లైట్లను పునరు ద్ధరించి ప్రయాణికులకు రక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గుర్రపు డెక్కతో పూడుకుపోయిన చెరువులు, కాలువలు



పేరుకుపోయిన గుర్రపు డెక్క

● పూడుకుపోయిన చెరువులు, కాలువలు

తాళ్ళపూడి, జూన్ 18: మండలంలో పలు గ్రామాల చెరువుల్లో, కాలువల్లో గుర్రపుడెక్క విపరీతంగా పెరిగి పూడుకుపోయాయి. గ తంలో గుర్రపుడెక్క పూడిక తీతకు ఉపాధి హామీ పథకం పనులు చేయించేవారు. ప్రస్తుతం ఈ పనిని ఉపాధిహామీ పథకంలో తప్పించగా ఎక్కడికక్కడ చెరువుల్లో కాలువల్లో విపరీతంగా గు ర్రపుడెక్క పెరిగిపోయింది. ముఖ్యంగా కొవ్వాడ కాలువలో పెరిగిన గుర్రపుడెక్కతో రానున్న వర్షాకాలంలో కొవ్వాడలో చేరిన వర్షపునీ రు ముందుకు సాగక పొలాలను ముంచెత్తే ప్రమాద ముంది. చెరువుల్లో, కొవ్వాడ కాలువలో గుర్రపు డెక్క తొలగింపుపై అధికా రులు ప్రత్యేకదృష్టి పెట్టాల్సి ఉందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	మనమే
వై.స్క్రీన్2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు
నిడదవోలు	
వీ మ్యాక్స్	మనమే
రాధాకృష్ణ	మహారాజా
శ్రీగణపతి	హరోమ్ హర
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా